PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 293 | విజయవాడ, శుక్రవారం 26 మే 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 26 May 2023 | Rs



కేరళ సంపూర్ణ ఇ-గవర్నెన్స్ రాష్ట్రం

- ప్రకటించిన సిఎం పినరయి విజయన్

● లోపలి పేజీలో..



నత్తనడకన గాలేరు-నగరి పనులు

- రూ.5,036 కోట్లతో పనుల్లో స్తబ్దత
- రెండేళ్లలో 16.08 శాతం మాత్రమే
- 2.75 లక్షల ఎకరాలు ప్రశ్నార్థకం

● లోపలి పేజీలో..



సనపాల అనిరుధ్



వెంకట మనీందర్‌రెడ్డి



బి సత్యరాజ జశ్వంత్



నాసిక వెంకట తేజ

తెలంగాణ ఎంసెట్‌లో ఆంధ్ర విద్యార్థుల హవా

- తొలి మూడు ర్యాంకులతో పాటు టాప్ 10లో ఎనిమిది కైవసం
- ఫలితాలు విడుదల చేసిన మంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సత్తాచాటారు. మొదటి మూడు ర్యాంకులతో పాటు టాప్ 10లో ఏకంగా ఎనిమిది ర్యాంకులు సాధించారు. ఎంసెట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి గురువారం హైదరాబాద్‌లోని జెఎన్ఎఫ్ఎయులో విడుదల చేశారు.

ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంజినీరింగ్ విభాగానికి 2,05,351 మంది దరఖాస్తు చేస్తే, 1,95,275 మంది పరీక్ష రాశారు. వారిలో 1,56,879 (80.34 శాతం) మంది అర్హత సాధించారు. ఇందులో 80,672 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 76,536 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 62,814 (82.07 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 1,24,679 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 1,18,739 మంది పరీక్ష రాశారు. వారిలో 94,065 (79.22 శాతం) మంది అర్హత పొందారు. అంటే ఇంజినీరింగ్ విభాగంలో అబ్బాయిల కంటే అమ్మాయిలు 2.85 శాతం అధికంగా ఉత్తీర్ణులు కావడం గమనార్హం. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,15,332 మంది దరఖాస్తు చేయగా, 1,06,514 మంది పరీక్ష రాశారు. వారిలో 91,935 (86.31 శాతం) మంది అర్హత సాధించారు.

ఇందులో 81,205 మంది అమ్మాయిలు దరఖాస్తు చేస్తే, 74,881 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 65,163 (87.02 శాతం) మంది అర్హత పొందారు. 34,127 మంది అబ్బాయిలు దరఖాస్తు చేయగా, 31,633 మంది పరీక్ష రాశారు. వారిలో 26,772 (84.63 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే అబ్బాయిల కంటే అమ్మాయిలు 2.39 శాతం అధికంగా అర్హత పొందారు. 2022లో ఇంజినీరింగ్ విభాగంలో 80.42 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో 88.34 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అంటే ఇంజినీరింగ్‌లో 0.08 శాతం, అగ్రికల్చర్, ఫార్మసీలో 2.03 శాతం తగ్గడం గమనార్హం. రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు.

'భరోసా' వస్తేనే విత్తనం

- సబ్సిడీ సీడ్ కొనుగోలు అప్పుడే
- ఖరీఫ్ పెట్టుబడుల్లేని సీమ రైతాంగం

- వేరుశనగ రిజిస్ట్రేషన్లు పది శాతం లోపే
- సేకరణలో కొనసాగుతున్న జాప్యం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ ముంగిట ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా కిస్తు బ్యాంక్ అకౌంట్‌లో జమ పడితేనేగాని సబ్సిడీ వేరుశనగ విత్తనాలను కొనుగోలు చేయలేని పరిస్థితి రాయలసీమ రైతాంగానిది. ఈ తడవ 'భరోసా' ఆలస్యమవుతుండటంతో రాయితీ విత్తనాలకు రైతులు ముందస్తు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ముందుకురావట్లేదు. సబ్సిడీ విత్తనాల కోసం రైతు భరోసా (ఆర్‌బికె) కేంద్రాల్లో డి-క్రిషి యాప్‌లో ఈ నెల 15 నుంచి నమోదుల ప్రక్రియ ప్రారంభించగా ఇప్పటికి 5 నుంచి 10 శాతం లోపు రైతులే తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సబ్సిడీ విత్తనాలు పొందాలంటే రైతులు ముందు సబ్సిడీయేతర అమౌంట్‌ను ఆర్‌బికెలలో చెల్లించాలి. ప్రభుత్వం నిర్ణయించిన అమ్మకపు ధరలో 40 శాతం సర్కారు రాయితీ ఇస్తుండగా మిగతా 60 శాతాన్నీ రైతులు ముందే చెల్లించాలి. విత్తనాల పంపిణీ మొదలయ్యాక విత్తనాలను రైతులకు చేరుస్తారు. విత్తనం అందడానికి వారం, రెండు వారాల ముందే సబ్సిడీయేతర పైకం చెల్లించాల్సి రావడంతో రైతులు రిజిస్ట్రేషన్ల జోలికి పోవట్లేదు. చేతిలో డబ్బుల్లేక ప్రభుత్వం ఇచ్చే భరోసా సొమ్ము జమ పడ్డప్పుడు చూసుకుందాం అన్నట్లున్నారు. యంత్రాంగం కూడా ప్రభుత్వం ఎప్పుడు 'భరోసా' విడుదల చేస్తుందా ఎప్పుడెప్పుడు రాయితీ విత్తనాలు సేల్ చేద్దామా అని ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఖరీఫ్ ముందు ఇచ్చే భరోసాను మే మూడు, నాలుగు వారాల్లో ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఈమారు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. జూన్ మొదటి వారంలో జమ చేయొచ్చని అంచనా వేస్తున్నారు.



అనంతపురం జిల్లా రేకులకుంటలో విత్తన వేరుశెనగను సిద్ధం చేస్తున్న రైతులు (ఫైల్ ఫొటో)

పక్కాగానే...

ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలి కిస్తు కింద రైతులకు రూ.5,500 జమ చేస్తోంది. రైతులకు ఈ ఏడాది గరిష్టంగా మూడు మూటల (మూట 30 కిలోల వంతున 90 కిలోలు) వేరుశనగ విత్తనం సబ్సిడీపై అందించాలని నిర్ణయించింది. సర్కారీ రాయితీ పోను మూడు మూటలకూ కలిపి రైతులు రూ.5,022 చెల్లించాలి. ప్రభుత్వం ఇచ్చే భరోసా కిస్తు, రైతు విత్తనం కోసం చెల్లించే సబ్సిడీయేతర సొమ్ము దాదాపు సరిపోతుంది. సబ్సిడీ విత్తనాలు రైతులు పొందేందుకు అనుగుణంగా సర్కారు డిజైన్ చేసిందని, భరోసా జమ పడిన వెంటనే సబ్సిడీ విత్తనాల రిజిస్ట్రేషన్లు ఊపందుకుంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. వేరుశనగ సాగు పట్ల రైతుల్లో అనాసక్తి ఉన్నా భరోసా జమ పడితే సబ్సిడీ విత్తనాల అమ్మకాలు పెరుగుతాయంటున్నారు.

నెమ్మదిగా ప్రొక్యూర్‌మెంట్


వేరుశనగ విత్తన సేకరణలో జాప్యం కొనసాగుతూనే ఉంది. రైతుల రిజిస్ట్రేషన్లు ఊపందుకోనందున సేకరణ కూడా మందకొడిగా జరుగుతోంది. సేకరణ లక్ష్యం 2.92 లక్షల క్వింటాళ్లు. టార్గెట్‌లో ఇప్పటికి 50 శాతం వరకు సేకరించారని, అందులోనూ ప్రాసెసింగ్ దశలోనే ఎక్కువుందని సమాచారం. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 1.88 లక్షల క్వింటాళ్లకుగాను అతికష్టం మీద లక్ష క్వింటాళ్లు సేకరించారు. మిగతా జిల్లాల్లో సేకరణ ఇంకా నెమ్మదిగా ఉంది.

తొలిదశ పూర్తికే ప్రాధాన్యం !

- పోలవరంపై వారంలోపు నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనల మేరకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మొత్తం ఎత్తు 45.72 మీటర్లు కాకుండా, తొలిదశ అయిన 41.15 మీటర్ల ఎత్తుకే కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ప్రాధాన్యత ఇస్తోంది. ఈ మేరకు 41.15 మీటర్ల ఎత్తుతో తొలిదశ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు సవరించిన అంచనా వ్యయం ప్రతిపాదనలు తయారు చేసేందుకు గురువారం ఢిల్లీలో కీలక సమావేశం జరిగింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) సిఇఒ శివనందన్‌కుమార్, సభ్యకార్యదర్శి రఘురామ్, కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) ఛైర్మన్ కుశ్వీందర్ సింగ్ ఓరా, సభ్యులు నవీన్‌కుమార్ హాజరయ్యారు. పోలవరం ప్రాజెక్టు తొలిదశను పూర్తిచేయడానికి రూ.16,952.07 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపినట్లు పిపిఎ వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.10 వేలకోట్లను అడ్‌హాక్ నిధుల కింద ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపింది. గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్, ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చటంతోపాటు 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో కొత్తగా 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి అవసరమైన వ్యయంపై పిపిఎ అధికారులు వివరించారు. పోలవరం ప్రాజెక్టులో కేవలం పునరావాసం కోసమే రూ.33,168.23 కోట్లు అవసరమవుతాయని అన్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టులో కీలకమైన ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ పనులతోపాటు స్పిల్‌వై, అప్రోచ్ కెనాల్స్ పనులు పూర్తయ్యాయని వివరించారు. ప్రస్తుతం ఎర్త్‌కం రాక్ ఫీల్డ్ డ్యామ్ పనులు జరుగుతున్నాయన్నారు. వర్షాలు కురిసి వరదలు వచ్చే జూన్ నాటికి ఈ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.16,950 కోట్లతో రూపొందించే నివేదికను ఖరారు చేశాక ఆ ప్రతిపాదనలు వారంలోపు తమకు నివేదించాలని పంకజ్‌కుమార్ ఆదేశించారు. ఈ ప్రతిపాదనను కేంద్ర మంత్రి మండలికి పంపాల్సి వుంటుందని తెలిపారు. ఆ అంచనా వ్యయంపై కేంద్ర మంత్రి మండలి ఆమోదముద్ర వేస్తే పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిధుల విడుదలకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.



త్వరలో గ్రూప్-1, 2 నోటిఫికేషన్లు

- 1000కి పైగా పోస్టులు!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) త్వరలో విడుదల చేయనుంది. ఈ నోటిఫికేషన్లకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎపిపిఎస్‌సి అధికారులు కలిశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వంలోని వివిధ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని సిఎంకు అధికారులు వివరించారు. పోస్టుల భర్తీ ప్రక్రియ చురుగ్గా సాగుతుందని వెల్లడించారు. నోటిఫికేషన్ జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని తెలిపారు. గ్రూప్-1కు సంబంధించి సుమారు 100కు పైగా పోస్టులు, గ్రూప్-2కు సంబంధించి సుమారు 900కు పైగా పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరలో పోస్టులను భర్తీ చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు.

రాష్ట్రపతే తగిన వ్యక్తి

- కొత్త పార్లమెంట్ ప్రారంభోత్సవంపై సుప్రీంలో పిటిషన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవంపై తలెత్తిన వివాదం అంతకంతకూ ముదురుతోంది. రాష్ట్రపతిని పక్కన పెట్టి ప్రధాన మంత్రి చేత దీనిని ప్రారంభింపజేయడమంటే ఈ దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్మును అవమానించడమేనని ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. ఈ వివాదం ఇలా కొనసాగుతుండగానే పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానిస్తూ ఆదేశాలివ్వాలంటూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఒకటి గురువారం దాఖలైంది. సుప్రీంకోరు సీనియర్ న్యాయవాది సిఆర్ జయసుకిన్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 28న ప్రారంభోత్సవం జరగనున్న పార్లమెంట్ భవనానికి సంబంధించిన ఆహ్వానాన్ని లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఈ నెల 18న విడుదల చేశారని తెలిపారు. రాష్ట్రపతిని ఆహ్వానించకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. "రాష్ట్రపతి దేశపు ప్రథమ పౌరురాలు. పార్లమెంట్‌కు అధిపతి. దేశానికి సంబంధించిన అన్ని ముఖ్యమైన నిర్ణయాలను భారత రాష్ట్రపతి పేరు మీద తీసుకుంటారు" అని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాష్ట్రపతి, రాజ్యసభ, లోక్‌సభలతో కూడిన పార్లమెంట్‌కు దేశంలో అత్యున్నత శాసనాధికారం ఉందని, పార్లమెంట్ నిర్వహణకు కాల్, ప్రోరోగ్ చేయడానికి, లోక్‌సభను రద్దు చేయడానికి రాష్ట్రపతికి అధికారం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 79ని ఉటంకిస్తూ, రాష్ట్రపతి పార్లమెంట్‌లో అంతర్భాగమని, అందువల్ల ప్రారంభోత్సవానికి దూరంగా ఉండకూడదని తెలిపారు. ఇది లోక్‌సభ సెక్రటేరియట్‌లో మాల్‌ప్రాక్టీస్‌ను స్పష్టం చేసిందని, అందువల్ల ప్రకటన, ఆహ్వానాలు సరైన ఆలోచన లేకుండా ఉన్నాయని పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నియామకానికి రాష్ట్రపతి మిగతా 2లో

గాలి దుమారం



రాష్ట్రవ్యాప్తంగా గురువారం పలుచోట్ల పెను గాలులు వీచాయి. అరటి తోటలు నేలకొరిగాయి. మామిడి పళ్లు రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నేలరాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కృష్ణా జిల్లాలోని గన్నవరం విమానశ్రయం వద్ద గురువారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీయడంతో ఆ ప్రాంతమంతా దూళిదుమ్ము కమ్మేశాయి.

ఫొటో : టివి రమణ

అమరావతిలో సిఎం తొలి సభ

- నేడు వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- దీక్షా శిబిరాల్లో నల్లబెల్లూన్లు ఎగురవేయాలని జెఎసి నేతల నిర్ణయం

● లోపలి పేజీలో..

అవినాష్ బెయిల్‌పై నేడు విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్, కర్నూలు బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణను తెలంగాణ హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. వాదనలకు ఎంత సమయం పడుతుందని వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి అడ్డగా..గంట సమయం పడుతుందని న్యాయవాదులు తెలపడంతో శుక్రవారం ఉదయం 10.30కు వాదనలు వింటామని న్యాయమూర్తి తెలిపారు. అవినాష్‌రెడ్డి ఏప్రిల్‌లో దాఖలుచేసిన పిటిషన్‌పై విచారించిన సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీచేస్తూ.. రోజూ విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. రాతపూర్వకంగా ప్రశ్నావళి ఇవ్వాలని సిబిఐని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ సునీతారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఉత్తర్వులను రద్దుచేస్తూ తాజాగా విచారణ చేపట్టాలంటూ ఏప్రిల్ 24న ఉత్తర్వులిచ్చింది. ఏప్రిల్ 27, 28 తేదీల్లో విచారణ చేపట్టినా వాదనలు పూర్తికాకపోవడంతో జూన్ ఐదునాటికి వాయిదా వేశారు. అయితే ఇందులో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి, జ్యుడిషియల్ ప్రొసీడింగ్స్ జారీచేయడానికి నిరాకరించారు. ఈ నేపథ్యంలో విచారణకు హాజరుకావాలంటూ సిబిఐ నోటీసులు జారీ చేయడంతో అవినాష్‌రెడ్డి మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇందులో తాము జోక్యం చేసుకోలేమని, తెలంగాణ హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ నెల 25న విచారణ చేపట్టి అవసరమైన ఉత్తర్వులు జారీచేయాలని ఆదేశించింది.



కర్నూలులో వీడని ఉత్కంఠ

హైకోర్టు విచారణ నేపథ్యంలో కర్నూలులో ఉత్కంఠ నెలకొంది. తీర్పు వెలువడిన వెంటనే అవినాష్ రెడ్డిని అరెస్టు చేస్తారనే ప్రచారం కొనసాగడంతో విశ్వభారతి ఆస్పత్రి వద్ద వైసిపి శ్రేణులు నానా హంగామా సృష్టించారు. ఆస్పత్రి, పరిసర ప్రాంతాలకు వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పోలీసులు వారికి పహారా కాశారు. మరో వైపు అవినాష్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు గురువారం హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. లక్ష్మమ్మ ఆరోగ్యం మెరుగుపడిందని, వాంతులు కూడా తగ్గాయని అందులో పేర్కొన్నారు. ఆమెను ఐసియు నుంచి సాధారణ వార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న లక్ష్మమ్మను కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చేర్చడంతో అవినాష్‌రెడ్డి కూడా అక్కడే ఉన్న సంగతి తెలిసిందే.

న్యాయం జరగాలి : కెఎ పాల్

అవినాష్‌రెడ్డికి న్యాయం జరగాలని, ఆయన తల్లి లక్ష్మమ్మ ఆరోగ్యం బాగుపడాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ.పాల్ పేర్కొన్నారు. కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అవినాష్‌ తల్లిని గురువారం ఆయన పరామర్శించారు.

బతుకు భారమై.. 'ఉపాధి' ఆసరాయై..

- ఉపాధి పనుల్లో పండుటాకుల పాట్లు



● లోపలి పేజీలో..

అమూల్ పాల సేకరణ నిలిపివేయండి

కేంద్ర హోం మంత్రికి తమిళనాడు సిఎం స్టాలిన్ లేఖ

చెన్నై : తమిళనాడులో పాల సేకరణను నిలిపివేయాల్సిందిగా గుజరాత్ డెయిరీ అమూల్‌ను ఆదేశించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఈమేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో అమూల్ పాలసేకరణ కార్యకలాపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. అమూల్ (కైరా జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్) పాలసేకరణ కారణంగా తమిళనాడుకి చెందిన ఆవిన్‌పై తీవ్ర ప్రభావం పడుతోందని ఆ లేఖలో పేర్కొన్నారు.

అమూల్ మల్టీ స్టేట్ కోఆపరేటివ్ లైసెన్స్‌ను వినియోగించి కృష్ణగిరి జిల్లాలో చిల్లింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పుతున్నట్లు ఇటీవల గుర్తించామని అన్నారు. తమిళనాడులోని కృష్ణగిరి, ధర్మపురి, వెల్లోర్, రాణిపేట్, కాంచీపురమ్, తిరువల్లూర్, తిరుపత్తూర్ జిల్లాల్లోని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్‌పిఒ), స్వయం సహకార సంఘాలు (ఎస్‌పిఒ) నుండి పాలను సేకరిస్తోందని అన్నారు. సహకార సంఘాలు ఇతర ప్రాంతాలను ఆక్రమించుకోకుండా... ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చేయడం ప్రామాణిక పద్ధతి అని స్టాలిన్ ఉద్ఘాటించారు. అమూల్ సేకరణ ఆపరేషన్ వైట్ ఫ్లడ్ స్ఫూర్తికి విరుద్ధమని.. దేశంలో ప్రస్తుత పాలకొరతను మరింత తీవ్రతరం చేస్తుందని పునరుద్ఘాటించారు. ఇది వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.



అవిన్ గ్రామీణ ప్రాంతాల్లోని 9,673 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను పర్యవేక్షిస్తోందని, సుమారు నాలుగు లక్షల మందికి పైగా సభ్యుల నుండి 35 ఎల్ఎల్‌పిడి పాలను సేకరిస్తోందని పేర్కొన్నారు. పాల ఉత్పత్తిదారులకు ఏకరీతిలో లాభదాయకమైన ధరలు లభించేలా హామీ ఇస్తుందని అన్నారు. అమూల్ చర్య దశాబ్దాలుగా నిజమైన సహకార స్ఫూర్తితో నడుస్తున్న అవిన్ మిల్క్‌షెడ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని ఆ లేఖలో పేర్కొన్నారు.

వ్యవసాయ ప్రణాళిక విడుదల చేయాలి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


వ్యవసాయ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆన్‌లైన్‌లో గురువారం జరిగింది. సమావేశం అనంతరం ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి వివరాలను ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సీజన్ మొదలవుతున్నందున రైతులకు అవసరమైన సమాచారం తెలుసుకునేందుకు తక్షణమే జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ ప్రణాళిక విడుదల చేయాలని కోరారు. పంటకాల్వలను, మురుగు డ్రెన్‌లను శుభ్రం చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను జిల్లాలు, మండలాల వారీ కేటాయింపులు చేసి రైతులకు అందుబాటులో వుంచాలని కోరారు. పత్తి, మిర్చి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విత్తనాల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



కానిస్టేబుల్‌కు తప్పనిసరి ఉద్యోగ విరమణ సబబే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విధులకు గైర్హాజరు, మద్యం సేవించి విధులకు హాజరు, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక కానిస్టేబుల్‌కు తప్పనిసరి ఉద్యోగ విరమణకు పోలీసుశాఖ ఇచ్చిన ఉత్తర్వుల్ని హైకోర్టు ఆమోదించింది. పోలీస్ ఉన్నతాధికారి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కానిస్టేబుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కొట్టేస్తూ తీర్పు చెప్పారు. కాకినాడకు చెందిన ఎపిఎస్‌పి కానిస్టేబుల్ వై బాలకృష్ణ చెప్పాపెట్టకుండా 21 రోజులు విధులకు డుమ్మాకొట్టాడు. పారిపోయిన పోలీసు అని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఏడాది 2010లో సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తప్పనిసరి ఉద్యోగ విరమణగా 2011లో డిజిపి ఉత్తర్వులిచ్చారు. దీనిని బాలకృష్ణ సవాల్ చేసిన రివ్యూ పిటిషన్‌ను డిజిపి కొట్టేశారు. ఈ ఉత్తర్వుల్ని 2020లో హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. ఎనిమిదేళ్ల తర్వాత హైకోర్టుకు వచ్చాడని తప్పుపట్టింది.

రాజధాని నాశనానికే ఇళ్ల పంపిణీ

- టిడిపి నేత బోండా ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి రాజధానిని నిర్వీర్యం చేసే కుట్ర రాజకీయాల్లో భాగంగానే పేదలకు పనికిరాని సెంటు పట్టాలిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు విమర్శించారు. నివాసయోగ్యం కాని ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లపట్టాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఉచితంగా భూమి ఇచ్చేందుకు టిడిపి ప్రభుత్వం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. నివాస స్థలాలు ఉండాల్సిన జోన్‌లో కాకుండా మరో ప్రాంతంలో పేదలకు స్థలాలు ఇవ్వడం ముమ్మాటికీ వారిని మోసగించడమేనని అన్నారు. పేదలకు ఇస్తున్న సెంటు భూముల్లో ఎలాంటి మౌలిక వసతులు లేవన్నారు. రాజధాని మహిళల్ని దుర్భాషలాడిన డిఎస్‌పి పోతురాజుపై ప్రైవేట్ కేసులు వేస్తామని, ఆయనపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టబోమని పేర్కొన్నారు.

పిడుగు పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పిడుగు పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం సదాశివపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. సదాశివపురం గ్రామానికి చెందిన 20 మంది వ్యవసాయ కూలీలు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో వరినాట్లకు వెళ్లారు. ఈ క్రమంలో వర్షం పడటంతో కూలీలంతా ఓ చెట్టుకిందకు చేరారు. దీంతో ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్టుకింద ఉన్న దేశమ్మ(63) అక్కడికక్కడే మరణించారు. సాలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. సాలమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

అమరావతిలో సిఎం తొలి సభ

- నేడు వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- దీక్షా శిబిరాల్లో నల్లబెల్లూన్లు ఎగురవేయాలని జెఎసి నేతల నిర్ణయం

ప్రజాశక్తి-గుంటూరు జిలా ప్రతినిధి/ తుళ్లూరు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజధాని గ్రామాల్లో శుక్రవారం జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొననున్నారు. 2019 డిసెంబరు 17న మూడు రాజధానుల ప్రకటన తరువాత రాజధానిలో బహిరంగంగా ఆయన పర్యటించిన పరిస్థితులు లేవు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు 1253 రోజులుగా ఉద్యమం చేస్తున్నా ఆ వైపు కన్నెత్తి చూడలేదు. అసెంబ్లీ, మంత్రివర్గ సమావేశాలకు మాత్రమే ఆయన సచివాలయానికి వచ్చి వెళ్తున్న సమయంలో రైతుల నిరసన కనిపించకుండా రోడ్డుకు ఇరు వైపులా పరదాలు కట్టి పోలీసులు అడ్డుగా నిలబడుతున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, ఎన్‌టిఆర్ జిల్లాలకు చెందిన 50 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలను ఇచ్చేందుకు ఈ నెల 26న ఆయన తుళ్లూరు మండలం వెంకటపాలెం రానున్నారు. ఈ సందర్భంగా 20 ఎకరాల్లో భారీ బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దాదాపు 60 వేల మంది సభకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇళ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులతోపాటు డ్వాక్రా మహిళలను సభకు సమీకరిస్తున్నారు. బహిరంగ సభా ప్రాంగణానికి ఎటువైపు నుంచి రైతులు వచ్చి నిరసన తెలుపుతారోనన్న అనుమానంతో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఎం సభ నేపథ్యంలో రైతులు తమ శిబిరాల్లోనే బెలూన్లు ఎగుర వేసి నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలపాలని అమరావతి జెఎసి నాయకులు నిర్ణయించిన నేపథ్యంలో సభా ప్రాంగణానికి ఐదు కిలో మీటర్ల దరిదాపుల్లో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు నియంత్రిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో నిర్మించిన ఆరు వేల టిడ్కో ఇళ్లను కూడా శుక్రవారం పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. సిఎంతో వీటిని లబ్ధిదారులకు అప్పగించనున్నారు. ఈ మేరకు సిఎం సభ ఏర్పాట్లను మంత్రులు ఆది మూలపు సురేష్, జోగి రమేష్, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు ఎల్ అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, ఎంపి నందిగం సురేష్, వైసిపి నాయకులు డొక్కా మాణిక్యవరప్రసాద్, కలెక్టరు వేణు గోపాలరెడ్డి, సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ తదితరులు పరిశీలించారు.



వెంటకపాలెంలో సభాస్థల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

రాజధానిలో వైసిపి నాయకుల విజయోత్సవ ర్యాలీ

రాజధానిలో వైసిపి నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తాళ్ళాయపాలెం జంక్షన్ దగ్గర ఉన్న మూడు రాజధానుల శిబిరం దగ్గర నుంచి వెంకటపాలెంలో జరిగే సిఎం సభ వరకు ర్యాలీ నిర్వహించారు.

ర్యాలీలో ఎంపి నందిగం సురేష్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం చేసిన ఉద్యమం విజయవంత మైందని ఆనందం వ్యక్తం చేశారు. సెంటు స్థలం పంపిణీపై పేదలను అవమానపరిచే విధంగా మాట్లాడిన మాటలను చంద్రబాబు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐనవోలులో వైఎస్ రాజశేఖర రెడ్డి, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు.

సంపూర్ణ ఇ-గవర్నెన్స్ రాష్ట్రంగా కేరళ

- ప్రకటించిన సిఎం పినరయి విజయన్

తిరువనంతపురం: కేరళను సంపూర్ణ ఇ-గవర్నెన్స్ రాష్ట్రంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. దేశంలోనే ఇ-గవర్నన్స్ సంపూర్ణంగా అమలు చేసిన రాష్ట్రంగా చరిత్రకెక్కింది. నవ కేరళకు బలమైన పునాది వేసే ప్రాజెక్టు ఇదని ముఖ్యమంత్రి అన్నారు. ఇ-గవర్నెన్స్‌తో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేయగలిగిందని, కేరళ మోడల్ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక మైలురాయి అని ఆయన తెలిపారు. "అన్ని గ్రామ కార్యాలయాలు స్మార్ట్ గ్రామ కార్యాలయాలుగా మార్చబడ్డాయి. రీ-సర్వే ప్రక్రియను శాస్త్రీయంగా, పారదర్శకంగా, వేగంగా చేయడానికి డిజిటల్ రీ-సర్వే ప్రాజెక్ట్ ప్రారంభించబడింది. ఇంటిగ్రేటెడ్ లోకల్ గవర్నెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ గత సంవత్సరం కేరళలోని అన్ని పంచాయతీలలో అమలు చేయబడింది, తద్వారా 250 సేవలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. కేరళ స్పెషల్ డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా కేరళ జియో పోర్టల్-2 ప్రారంభించబడింది. దీని ద్వారా కేరళలోని 600 పంచాయతీలు, 31 మున్సిపాలిటీల్లో విపత్తు నిర్వహణ మ్యాపింగ్ పూర్తయింది. ఈ సైబర్ టెక్నాలజీ యుగంలో కేరళ పోలీసులను ఆధునీకరించి ముందుకు తీసుకెళ్తున్నాం. సైబర్ నేరాలను అరికట్టడంలో, ఆన్‌లైన్ సేవలను అందించడంలో కేరళ పోలీసులు దేశానికే రోల్ మోడల్. " అని విజయన్ తెలిపారు



కేరళ ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న సిఎం విజయన్ (ఫైల్)

ఇంటర్నెట్ పౌరుల హక్కు

మౌలిక సదుపాయాల అభివృద్ధి స్థాయి, కార్యాచరణ స్థాయి, వినియోగ స్థాయిలలో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడం ద్వారా ఇ-గవర్నెన్స్ వ్యవస్థలను పరిపూర్ణంగా తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కె ఫోన్ వచ్చే నెల నుంచి అమలులోకి వస్తుంది. దీంతో ఇంటర్నెట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. బహిరంగ ప్రదేశాల్లో వై-ఫై, కే-ఫై పథకాన్ని అమలు చేస్తున్నారు. సమాజంలో డిజిటల్ విభజనను తొలగించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ షట్ డౌన్ సర్వసాధారణంగా మారింది. 'కేరళలో ఇంటర్నెట్ పౌరుల హక్కు' అని ముఖ్యమంత్రి అన్నారు.

సచివాలయ ఉద్యోగులకు బదిలీలు

- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఇందుకు సంబంధించిన జిఓ 5ను గ్రామ, వార్డు వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం విడుదల చేశారు. జూన్ 8 వరకు బదిలీలు జరుగుతాయి. రెండేళ్ల సర్వీస్ పూర్తిచేసుకుని ప్రొబేషన్ డిక్లేర్ అయిన ఉద్యోగులందరూ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లా, అంతర్ జిల్లాల బదిలీలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. కేటగిరి-ఎకు జిల్లాల్లో మాత్రమే బదిలీకి అవకాశం ఇచ్చారు. కేటగిరి-బికి అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం ఉంది. ఎసిబి, విజిలెన్స్, క్రమశిక్షణ రహిత చర్యలు ఉన్న ఉద్యోగులకు అవకాశం లేదు. ఎంపిడిఒ, మున్సిపల్ కమిషనర్ నుంచి ఎటువంటి బకాయిలు లేవనే సర్టిఫికెట్ పొందుపరచాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించాలి. పనిచేస్తున్న చోట 20 శాతానికి మించి బదిలీలు జరగకూడదు. ఉద్యోగి సొంత ప్రాంతంలో బదిలీకి అవకాశం లేదు. బదిలీ అయిన ఉద్యోగి టిఎ, డిఎ వంటి వాటికి అర్హులు కారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల ఉత్తర్వుల పట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎమ్‌డి జానిపాషా వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

బతుకు భారమై..'ఉపాధి' ఆసరాయై..



' నాకు ఆరుగురు పిల్లలు. ఇద్దరు కూతుళ్లు, నలుగురు కొడుకులు. మేమిద్దరు ముసలోళ్లం. ఎటువంటి జీవనాధారం లేదు. ఎవరికి వాళ్ల వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. మమ్మల్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదు'. వృద్ధాప్య పింఛన్ రూ.2,700 సుగర్ మందులకే సరిపోతుంది. వ్యవసాయ పనులు చేయలేం. ఏ ఆదరువు లేదు. ఈ పరిస్థితుల్లో ఉపాధి పనులే దిక్కయ్యాయి.

- ఇదీ కడప జిల్లా వల్లూరు మండలం, చాకవారిపల్లి గ్రామానికి చెందిన కె.యల్లాయమ్మ ఆవేదన.

'వ్యవసాయ పనులే ఆధారం. నాకు ఒక కూతురు. పెళ్లి చేశా. కూతురుకు భారంగా మారడం నచ్చలేదు'. ఏదైనా పనిచేద్దామనుకుంటే వయస్సు తగ్గడంతో రైతులు పనులకు పిలవడం లేదు.ఇంటి పట్టనే ఊరకనే ఉండి, కుటుంబానికి భారంగా మారడం కన్నా, ఉపాధి పనుల ద్వారా వచ్చే లెక్కతో తన బతుకు తాను బతకాలనే ఉద్దేశంతోనే ఉపాధి పనులకు వచ్చాను.

- వెంకటేశాపురం గ్రామానికి చెందిన మారతమ్మ దీనగాథ.



- ఉపాధి పనుల్లో పండుటాకుల పాట్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఇది ఒక్క యల్లాయమ్మ, మారతమ్మల (పేర్లు మార్చాం) పరిస్థితి కాదు. కడప జిల్లాలో ప్రతి మండలంలోని 50 నుంచి 70 ప్రాంతాల్లో ఉపాధి పనులు చేస్తున్న ప్రతి టీములోనూ ఇటువంటి ధీనగాథలు కొకొల్లలు. తొమ్మిదో తరగతి చదువుతున్న విష్ణువర్ధన్‌తో మొదలుకుని 60 ఏళ్ల వయస్సు మీరిన వృద్ధులు సైతం ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉపాధి హామీ పనులకు హాజరవుతున్న జిల్లాలో కడప జిల్లా ఒకటి. రోజుకు 1.09 లక్షల నుంచి 1.35 లక్షల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఉపాధి కూలీలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు, వసతుల కల్పన వంటి అంశాలపై ప్రజాశక్తి పరిశీలనలో వెలుగులోకి వచ్చిన కొన్ని అంశాలివి. వల్లూరు మండలం గోటూరు చెరువు, ఓబాయపల్లి ప్రాంతాల్లో ఉపాధి పనులు చేపట్టారు. గోటూరు చెరువు, ఓబాయపల్లిలో ఒక్కో ప్రాంతంలో 300 జాబ్‌కార్డులు ఉండగా, ఐదు టీములుగా టీముకు 40 మంది చొప్పున 200 మంది హాజరయ్యారని ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ తెలిపారు. ఉపాధి పనులకు వచ్చిన వారిలో టీముకు ఒకరు చొప్పున ఐదుగురు వృద్ధులు ఉండడం గమనార్హం. వారిని పలకరించగా వృద్ధాప్య పింఛన్ తీసుకుని ముద్ద పెట్టడమే గగనంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో తమకు అనారోగ్య పరిస్థితులు ఎదురైతే పట్టించుకోవడం లేదని కొందరుచెబుతుండగా.. సుగర్, బిపి, కంటి రోగాలు వంటి దీర్ఘకాలిక రోగాలకు అవసరమైన మందులకు వృద్ధాప్య పింఛన్ సరిపోతోందని మరికొందరు చెబుతున్నారు. కుటుంబాలకు భారం కాకుడదని,కాళ్లు, చేతులు ఆడినంత వరకు పనులకు వెళ్తామని చెబుతున్నారు.

చికిత్స కోసం వెళ్తుండగా... ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- చిన్నారి సహా ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి-వెంకటాచలం (నెల్లూరు జిల్లా)



రామారావు

నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొంది. దీంతో చిన్నారితో సహా ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురికి తీవ్ర గాయాల య్యాయి. ఈ సంఘటన మనుబోలు మండలం బద్దవోలు క్రాస్ రోడ్డు సమీపంలోని చెన్నై- కలకత్తా జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం దామేగుంటకు చెందిన గ్రేష్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆస్పత్రిలో చూపించేందుకు బంధువులు దుర్గా ప్రసాద్, విష్ణు ప్రియ, రామారావు (40), వనిత, ఏంజెల్, మెర్సీ (15), సనత్ తేజ(3)లతో కలిసి కారులో చెన్నైకు బయలుదేరారు. బద్దవోలు అడ్డరోడ్డు వద్దకు రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రామారావు, మెర్సీ, సనత్ తేజలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మిగతా ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య మిత్రలకు రూ.26 వేలు చెల్లించాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆరోగ్య మిత్రలకు కేటగిరి-1 కేడర్ కేటాయించి సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.26 వేలు చెల్లించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎపి ఆరోగ్యమిత్ర ఎస్‌సి, ఎస్‌టి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులతో కలిసి వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబును గురువారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆరోగ్యశ్రీ పథకంలో ప్రధాన భూమిక పోషించేది ఆరోగ్య మిత్రలే అని తెలిపారు. వారికి సరైన వేతనం, ఉద్యోగ భద్రత లేదని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఆరోగ్య మిత్రులకు ఏడాదికి ఒకసారి ఇంక్రిమెంటు కనీసం రూ.1000 ఇవ్వాలని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల వలే హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో వెయిటేజ్ కల్పించాలని, బదిలీలు నిర్వహించాలని తెలిపారు. సిహెచ్‌సి, ఎహెచ్, డిహెచ్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారిని అక్కడే కొనసాగించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న వారికి టిఎ, డిఎల సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాచెర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి డి రాంబాబు, కార్యదర్శి కాకాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీస్ రెన్యువల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు, గెస్ట్ సిబ్బంది సర్వీసును రాష్ట్ర ప్రభుత్వం రెన్యువల్ చేసింది. 2023-24 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ గురువారం జిఓ 84, 85ను విడుదల చేశారు.

మొత్తం 3,618 మంది కాంట్రాక్టు లెక్చరర్లు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్నారు. వీరి సర్వీసును 11 నెలలపాటు అంటే.. జూన్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 వరకు రెన్యువల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కొనసాగుతున్న 783 గెస్ట్ సిబ్బందిని రెన్యువల్ చేయడంతోపాటు కొత్తగా మరో 291 మందిని తీసుకున్నట్లు తెలిపారు. వీరి సర్వీసు 10 నెలలపాటు జూన్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రెన్యువల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హిందూజాకు అక్రమ చెల్లింపులు ఆపాలి

- ఎపిఇఆర్‌సికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హిందూజా కంపెనీకి డిస్కమ్‌లు చెల్లిస్తున్న అక్రమ చెల్లింపులు ఆపాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) కార్యదర్శికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు గురువారం లేఖ రాశారు. హిందూజా పిపిఎపై కమిషన్ గతేడాది ఆగస్టు 1న ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. కమిషన్ ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిస్కమ్‌లు భారీ మొత్తంలో చెల్లించిన వ్యవహారంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2023-24 ఏడాదికి డిస్కమ్‌లు ప్రతిపాదించిన ఎఆర్ఆర్ ఛార్జీలపై బహిరంగ విచారణలో తాము ఈ అంశాలను లేవనెత్తామని గుర్తుచేశారు. కమిషన్ పరిధిలో ఉన్న ఈ అంశంపై నేరుగా విచారణ చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఉత్తర్వులకు విరుద్ధంగా డిస్కమ్‌లు హిందూజాకు చెల్లింపులు చేసినట్లు తేలితే ఎఫ్‌పిపిఎ క్లెయిమ్‌లలో చెల్లింపులను అనుమతించబోమని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొందని అన్నారు. విద్యుత్ చట్టం-2003 ప్రకారం డిస్కమ్‌లు విద్యుత్ కొనుగోలు సేకరణ ప్రక్రియ కమిషన్ నియంత్రణ పరిధిలో ఉందని, అందులో భాగంగా విద్యుత్ కొనుగోలు చెల్లింపులు అంశం కూడా కమిషన్ నియంత్రణ పరిధిలో ఉందన్నారు. 2023 ఫిబ్రవరి 16న ఇంధనశాఖ జిఓ 19లో హిందూజా సంస్థకు రూ.1,236 కోట్లు అదనపు మొత్తాన్ని చెల్లించాలని పేర్కొందని తెలిపారు. ఈ నెల 3న జరిగిన విచారణలో జిఓ కాపీని కమిషన్‌కు అందజేస్తే చెల్లింపులపై స్పష్టత లేదని ఛైర్మన్ నాగార్జున రెడ్డి పేర్కొన్నారని వివరించారు. చెల్లింపులు ఎందుకు చేశారో డిస్కమ్‌ల న్యాయవాది వివరించాలని విద్యుత్ రంగ నిపుణులు ఎం వేణుగోపాలరావు లేవనెత్తారని పేర్కొన్నారు. డిమ్‌డ్ జనరేషన్‌కు స్థిర ఛార్జీలను డిస్కమ్‌లు హిందూజాకు చెల్లిస్తున్నాయని డిస్కమ్‌ల న్యాయవాది పి శివరాం చెప్పారని వివరించారు. వేణుగోపాలరావు అభ్యంతరాలపై హిందూజా సంస్థ న్యాయవాది సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు. కమిషన్ ఉత్తర్వులకు విరుద్ధంగా హిందూజాకు చెల్లింపులు చేయడంపై తాము అభ్యంతరాలు లేవనెత్తామని గుర్తుచేశారు. డిమ్‌డ్ జనరేషన్‌కు స్థిర ఛార్జీలు చెల్లింపు అంశంపై కమిషన్, ఎలక్ట్రిసిటీ అపిలేట్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా హిందూజా ఏనాడూ లేవనెత్తలేదని పేర్కొన్నారు. గత ఆగస్టు 1వ తేదీ ముందు కాలానికి డిమ్‌డ్ జనరేషన్‌కు హిందూజా ప్రాజెక్టుకు డిస్కమ్‌లు స్థిర ఛార్జీలు చెల్లించాలని కమిషన్, ఎపిటెల్, సుప్రీంకోర్టు ఆదేశించలేదని స్పష్టం చేశారు. తమ అభ్యంతరాలపై ఇఆర్‌సి స్పందించి హిందూజాకు చెల్లింపులను అడ్డుకోవాలని కోరారు.



దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ కార్యకర్తలు

స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సాయం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమైన ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలని స్టీల్ హెచ్‌ఎంఎస్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దొమ్మేటి అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 784వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటులో ఉత్పత్తి పెంచడానికి వెంటనే కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. ఉత్పత్తిని తగ్గించే విధంగా వ్యవహరించడం భావ్యం కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా ఐక్యపోరాటాలతో తిప్పికొడతామని స్పష్టం చేశారు. దీక్షల్లో కూర్చున్న వారిలో సీరపు వెంకటరావు, గొందేసి రమణారెడ్డి, గొడ్డి రమణ, పేర్ల అమ్మోరు ఉన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకునేందుకు చంద్రబాబు యత్నం

- మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇస్తుంటే చంద్రబాబు తన బినామీల ద్వారా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రాష్ట్ర మంత్రులు మేరుగ నాగార్జున, జోగి రమేష్ ఆరోపించారు. కోర్టులు అమరావతిలో పేదలకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును కూడా అపహాస్యం చేస్తూ చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. అమరావతిలో రైతులను చంద్రబాబు నిలువునా ముంచారన్నారు. పేద ప్రజలు అమరావతిలో నివసించరాదని చంద్రబాబు కోరుకుంటే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా 51 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తున్నారని అన్నారు. చంద్రబాబు మభ్యపెట్టడం వల్లే రాజధాని ప్రాంత రైతులు నష్టపోయారని తెలిపారు. కోర్టు తీర్పులు ఇచ్చినా ఇంకా అడ్డుకోవాలని చూస్తే చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. మహిళలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయాలని చూస్తున్నారని, అడ్డుకోవాలని చూస్తే చట్టం తన పని తాను చేస్తుందని తెలిపారు. శుక్రవారం నాడు అమరావతి ప్రాంతంలో సామాజిక పండగలా జరిగే ఇళ్ల పట్టాల పంపిణీకి పెద్దఎత్తున ప్రజలు హాజరుకావాలని కోరారు.

రాష్ట్రపతే తగిన వ్యక్తి

మొదటి పేజీ తరువాయి

ఆమోదముద్ర వేస్తారు. ప్రధాని సలహాతో ఇతర మంత్రులను రాష్ట్రపతి నియమిస్తారు. గవర్నర్లు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, కాగ్, యుపిఎస్‌సి ఛైర్మన్, సిఇసి, ఫైనాన్షియల్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తారు. అటువంటి రాష్ట్రపతిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించకుండా లోక్‌సభ సెక్రటేరియట్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడింది' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అక్రమం, ఏకపక్షం, అధికార దుర్వినియోగం, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉందని తెలిపారు. ఈ కేసులో లోక్‌సభ సెక్రటేరియట్, కేంద్ర హోం శాఖతోపాటు న్యాయశాఖను పార్టీలుగా చేర్చారు.

తెలంగాణ ఎంసెట్‌లో ఆంధ్ర విద్యార్థుల హవా

ఎంసెట్ టాపర్ల వివరాలు

ఇంజినీరింగ్ విభాగం

ర్యాంకు	పేరు	మార్కులు	జిల్లా
1	సనపల అనిరుధ్	158.898780	విశాఖపట్నం
2	వెంకట మనీందర్‌రెడ్డి	158.591169	గుంటూరు
3	చల్లా ఉమేష్ వరుణ్	156.942768	కృష్ణా
4	అభినీత్ మజేటి	156.582397	రంగారెడ్డి
5	పొన్నతోట ప్రమోద్‌కుమార్‌రెడ్డి	156.015502	అనంతపురం
6	మరదాన ధీరజ్‌కుమార్	156.015502	విశాఖపట్నం
7	వడ్డే శన్వితారెడ్డి	155.951537	నల్లగొండ
8	బోయిన సంజన	155.543256	శ్రీకాకుళం
9	నంద్యాల ప్రిన్స్ బ్రహ్మంరెడ్డి	155.338544	కర్నూలు
10	మీసాల ప్రణతి శ్రీజ	155.020583	విజయనగరం

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం

ర్యాంకు	పేరు	మార్కులు	జిల్లా
1	బూరుగుపల్లి సత్యరాజ జశ్వంత్	155.008732	తూర్పుగోదావరి
2	నాసిక వెంకట తేజ	154.601240	ప్రకాశం
3	సఫల్ లక్ష్మి పసుపులేటి	154.520464	రంగారెడ్డి
4	దూర్గంపూడి కార్తికేయరెడ్డి	153.577578	గుంటూరు
5	బోర వరుణ్ చక్రవర్తి	152.639567	శ్రీకాకుళం
6	దేవగుడి గురు శశిధర్‌రెడ్డి	152.445127	రంగారెడ్డి
7	వంగిపురం హర్షిల్ సాయి	151.332512	నెల్లూరు
8	దడ్డనాల సాయి చిద్విలాస్ రెడ్డి	150.967824	గుంటూరు
9	గంధమనేని గిరి వర్షిత	150.953026	అనంతపురం
10	కొల్లబత్తుల ప్రీతం సిద్ధార్థ	150.950350	హైదరాబాద్

సిఎంను కలిసిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి కలిశారు. జమ్మూలో టిటిడి నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయ మహాసంప్రోక్షణకు సిఎంను ఛైర్మన్ ఆహ్వానించారు. జూన్ 3 నుంచి 8 వరకు ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సిఎం క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ న్యూఢిల్లీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు.

నాటు పడవ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని బలిమెల జలాశయంలో నాటుపడవ బోల్తా పడి ఒకరు మరణించారు. ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఒడిశా పోలీసుల కథనం మేరకు..ఒడిశాలోని మల్కనగిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి డైక్-3 గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు నాటు పడవలో చేపలవేటకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడటంతో పడవ అదుపుతప్పి జలాశయంలో బోల్తా పడింది. ముగ్గురిలో హరి, కైలాస్ ఒడ్డుకు చేరుకోగా.. గ్రే నీటమునిగి మరణించాడు. దీంతో అతని స్వగ్రామమైన డైక్-3లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మరో 3 రోజులు అధిక ఉష్ణోగ్రతలు

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరో మూడు రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం కృష్ణా జిల్లా నందిగామ, పల్నాడు జిల్లా నర్సరావుపేటలో 44.5 డిగ్రీలు, తిరుపతి జిల్లా గూడూరు, ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో 44.4 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతోపాటు వర్షాలు పడ్డాయన్నారు. శుక్రవారం రాష్ట్రంలోని 84 మండలాల్లో, శనివారం 130 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రభావిత జిల్లాల యంత్రాంగానికి, సంబంధిత మండల అధికారులకు సూచనలు జారీ చేశామన్నారు. ప్రజలు తమ మండలాల్లోని ఎండ తీవ్రత, ఇతర సమాచారం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలో 24 గంటలు అందుబాటులో ఉండే స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌కు 1070, 112, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

నత్తనడకన గాలేరు-నగరి పనులు

- రూ.5,036 కోట్లతో పనుల్లో స్తబ్దత
- రెండేళ్లలో 16.08 శాతం మాత్రమే
- 2.75 లక్షల ఎకరాలు ప్రశ్నార్థకం



కాలేటివాగు టన్నెల్ పనులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గాలేరు నగరి-హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నత్తనడకన సాగుతోంది. 2021 మార్చిలో జలవనరుల శాఖ రూ.5,023 కోట్లతో టెండర్‌ను పిలవగా..నవయుగ, పిఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ జాయింట్ వెంచర్ దక్కించుకుంది. అప్పటి నుంచి సుమారు రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ 16.08 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఈ లెక్కన మిగిలిన 83 శాతం పనులు పూర్తి చేయడం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ఇందుకు భూ సేకరణ అడ్డంకులు, సకాలంలో బిల్లుల చెల్లింపులు చేయకపోవడం వంటి సమస్యలను ప్రధాన కారణాలుగా అధికారులు పేర్కొనడం గమనార్హం.

జిల్లాలోని గాలేరు-నగరి ప్రధాన కాల్వ నుంచి సుమారు 135 కి.మీ 0.6 డయాఫ్రమ్ సామర్థ్యం కలిగిన పైప్‌లైన్ సహాయంతో 198 మీటర్ల నుంచి 1500 మీటర్ల ఎత్తులోని హంద్రీనీవా ప్రధానకాల్వలోనికి 1500 క్యూసెక్కుల చొప్పున 10 మోటార్ల సహాయంతో చిత్తూరు జిల్లాలోని పుంగనూరు బ్రాంచ్ కెనాల్ వరకు 20 టిఎంసిల నీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఈ పనులను జలవనరులశాఖ మూడు దశలుగా విభజించింది.

మొదటి విడత కింద కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో కాలేటివాగు ఎత్తిపోతల పనులు మినహా మిగిలిన పనులు నత్తనడకన సాగుతుండడం గమనార్హం. 2023 జూన్ నాటికి కడప జిల్లా చక్రాయపేట మండలంలో 43 చెరువులకు, అన్నమయ్య జిల్లాలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లి మండలాల్లోని 90 చెరువుల పరిధిలోని 32 వేల ఎకరాల ఆయ కట్టుకు 1.5 టిఎంసిలను సరఫరా చేయాల్సి ఉంది. గాలేరు-నగరి ప్రధాన కాల్వ 56 కి.మీటర్లలో 30 కిలోమీటర్ల మేర మాత్రమే లైనింగ్ పనులు చేశారు. ఇందులోని 12 స్ట్రక్చర్లలో 10 స్ట్రక్చర్లు పూర్తి చేశారు. మిగిలిన ప్రధాన కాల్వ పనులతోపాటు రెండు స్ట్రక్చర్ల నిర్మాణాలను, చేపట్టాల్సి ఉంది.

రెండవ దశలో అన్నమయ్య జిల్లాలోని వెలిగల్లు, పెద్దేరు రిజర్వాయర్ల పరిధిలోని కల్లూరివాండ్లపల్లి చెరువు, మూడవదశ కింద శ్రీనివాసపురం, అడవిపల్లి రిజర్వాయర్ల పరిధిలోని నాయని చెరువులను అనుసంధానం చేయాల్సి ఉంది. రెండు, మూడు దశలను పరిశీలిస్తే ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈలెక్కన మూడు దశలను పరిశీలిస్తే 16.9 శాతం మాత్రమే పూర్తి చేయడం గమనార్హం. మిగిలిన 83 శాతం పనులు 2024 మార్చి గడుపు లోపు పూర్తి చేయడంపై సందేహాలు నెలకొన్నాయి. ఎత్తిపోతల పనుల్లో ప్రధాన కాల్వ పనులే నత్తనడకన సాగుతుంటే మిగిలినకాల్వల లైనింగ్, స్ట్రక్చర్లు మినహాయిస్తే మొదటి దశలోని చక్రయపేట మండలంలో నాలుగు కిలోమీటర్ల టన్నెల్, లిఫ్టులు, పైప్‌లైన్, పంప్‌హౌస్, 320 మెగావాట్ల విద్యుత్ స్టేషన్ల నిర్మాణం వంటి పనుల్లో ఎటువంటి పురోగతీ లేదు.

ఎత్తిపోతల పనులు నత్తనకడన సాగడానికి గల ప్రధాన కారణాలను పరిశీలిస్తే 1550 ఎకరాల భూసేకరణ పనులు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. రూ.ఐదు వేల కోట్ల పనుల్లో రూ. 1100 కోట్ల పనులు చేయగా బిల్లుల చెల్లింపులు సజావుగా చేయకపోవడం, టన్నెల్ ఏర్పాటులో సాంకేతిక సమస్యలు ఎదురుకావడం వంటి సమస్యలను కారణాలను చూపుతుండడం గమనార్హం. కడప జిల్లాలో 570 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 830 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 70 ఎకరాలను సేకరించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో 200 ఎకరాలకు సంబంధించిన భూసేకరణ బిల్లులను అప్‌లోడ్ చేసింది. కానీ చెల్లింపుల్లో ఎటువంటి పురోగతి లేకపోవడంతో పనుల్లో స్తబ్దత నెలకొంది. కడప, అన్నమయ్య చిత్తూరు జిల్లాల పరిధిలోని 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

భూసేకరణ మాట వాస్తవమే

1550 ఎకరాల మేర భూసేకరణ చేయాల్సిన మాట వాస్తవమే. 32 ఎకరాలకు ఫారెస్టు క్లియరెన్స్ రావాల్సి ఉంది. ఫారెస్టు క్లియరెన్స్ వచ్చిన వెంటనే పనులను వేగవంతం చేస్తాం.

- ఎం.మల్లికార్జునరెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్, కడప.



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

తెలంగాణ ఎంసెట్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ ఎంసెట్-2023 ఫలితాల్లో గుంటూరు భాష్యం విద్యార్థులు విశేష ప్రతిభ చూపారని ఆ విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. గుంటూరులోని భాష్యం కళాశాలలో ఆయన మాట్లాడుతూ గురువారం విడుదలైన ఫలితాలలో గుంటూరుకు చెందిన వై.మణీందర్‌రెడ్డి 2వ ర్యాంకు, సిహెచ్.ఉమేష్ వరుణ్ 3వ ర్యాంకు సాధించారన్నారు. ఎ.వెంకట శివరామ్ 15వ ర్యాంకు, కె.లక్ష్మీ సూర్య 17, వై.దీపేష్ 20, పి.నిశ్చల్ సుభాష్ 26, పి.రూపేష్ 32, ఐ.హర్షిత 38, యు.అజయ్‌కుమార్ 73, టి.బాలకోటయ్య 84, బి.హర్షిత్ 99 వంటి వందలోపు 11 స్టేట్ ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని రామకృష్ణ పేర్కొన్నారు. భాష్యం ఐఐటి జెఇఇ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో తిరుగులేని ఫలితాలు సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో కూడా భాష్యం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎంసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ రామకృష్ణతోపాటు, డైరెక్టర్ హనుమంతరావు అభినందనలు తెలిపారు.

పింఛన్ల అమలుపై ఆరా

- రాష్ట్రానికి ఆర్‌బిఐ నుంచి ప్రశ్నావళి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో పింఛన్ల అమలుపై రిజర్వ్‌బ్యాంకు ఆరా తీస్తోంది. ఒకవైపు నివేదిక సిద్ధంచేసేందుకే అని చెబుతున్నప్పటికీ, ఇతరత్రా కారణాలు ఉంటాయన్న భావాన్ని ఉన్నతాధికారులు వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లకు సంబంధించి అన్ని కోణాల్లో వివరాలు కోరింది. ఈ మేరకు రాష్ట్రంలో పింఛన్ల అమలుకు తీసుకుంటున్న విధానాలను వివరించాలని రాష్ట్ర ఆర్థికశాఖ, ట్రెజరీ అధికారులకు రిజర్వ్‌బ్యాంకు నుంచి లేఖ అందింది. అన్ని రాష్ట్రాల్లో ఈ విధానాలపై అధ్యయనం చేస్తున్నామని, అందుకే వివరాలు సేకరిస్తున్నామని లేఖలో పేర్కొంది. పింఛన్లకు సంబంధించి ఏ శాఖ బాధ్యతలు తీసుకుంటోందన్నది చెప్పాలంది. అలాగే నిర్ధిష్టంగా రాష్ట్రంలో కేంద్రీయ విధానం ఉందా, లేక ట్రెజరీలు, జిల్లా యంత్రాంగాల స్థాయిలో జరుగుతోందా అన్నది కూడా కోరింది. ఈ రెండు రకాల్లో దేనిని అమలు చేస్తున్నారు, అందుకు మౌలిక వ్యవస్థ ఏమిటన్నది చెప్పాలని పేర్కొంది.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అమలు చేస్తున్నారా, పింఛన్ ఫైళ్లు ఎలా జనరేట్ అవుతున్నాయి అన్నదానిపైనా ప్రశ్నించింది. ఈ పింఛన్లను రిజర్వ్‌బ్యాంకు ద్వారా కొనసాగిస్తున్నారా, లేక ఇతర బ్యాంకుల ద్వారానా అన్నటు వంటి సూక్ష్మస్థాయి విషయాలపైనా వివరాలు కోరింది.

జిసిసి కాఫీ, మిరియాలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



గిరిజన సహకార సంస్థ (జిసిసి) మరో మైలురాయిని అందుకుంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్న కాఫీ గింజలు, మిరియాలకు ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. వ్యవసాయ మరియు ప్రాసెస్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) ఈ ఆర్గానిక్ సర్టిఫికేషన్ మంజూరు చేసిందని జిసిసి వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ తెలిపారు. జిసిసి ప్రోత్సాహంతో అల్లూరి జిల్లాలోని చింతపల్లి డివిజన్ పరిధిలో గల గొందిపాకలు, లంబసింగి, కప్పాలు క్లస్టర్లలో 1300 మంది రైతులు పెద్ద సంఖ్యలో కాఫీ, మిరియాలు సాగుచేస్తున్నారు. ఈఆర్గానిక్ సర్టిఫికేషన్‌తో గిరిజన రైతులు పండిస్తున్న కాఫీ, మిరియాలకు మరింత అధిక ధర లభించే ఆస్కారం ఏర్పడుతుంది. కాఫీ రైతులకు ఆర్థిక లబ్ధి చేకూరుతుంది. తమ కృషిలో సహకరిస్తున్న గిరిజన రైతులకు, గిరిజన వికాస స్వచ్ఛంద సేవా సంస్థకు, మెసెర్స్ రిలయబుల్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఆర్గనైజేషన్ (ఆర్‌సిఒ)కు, బెంగళూరు సర్టిఫికేషన్ ఏజెన్సీకి జిసిసి కృతజ్ఞతలు తెలిపింది.

సైన్స్‌కు వక్రభాష్యం

- కేంద్ర మంత్రులపై శాస్త్రవేత్తల మండిపాటు

న్యూఢిల్లీ : ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల సమీక్షపై పలువురు శాస్త్రవేత్తలు తమ నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రులు సైన్స్‌కు వక్రభాష్యం చెబుతున్నారని మండిపడ్డారు. పరిశోధన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపును తగ్గించడాన్ని తప్పుపట్టారు. దేశంలో వివిధ రంగాలకు చెందిన శాస్త్రవేత్తలు న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమయ్యారు. ప్రస్తుతం అమలవుతున్న సైన్స్ విధానం చిన్నారులపై భారం మోపుతోందని ప్రముఖ భాషావేత్త జిఎన్ దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న రాజకీయ విధానాలు ప్రజలను మత్తులో ముంచుతున్నాయని, వారు దేనిపైనా స్పందించలేకపోతున్నారని చెప్పారు. కేంద్రప్రభుత్వం, మంత్రులు అబద్ధాలు చెబుతున్నారని తెలిసినప్పటికీ వారు స్పందించడం లేదన్నారు. రాజ్యాంగం నిర్మించిన వ్యవస్థలన్నీ బలహీనమయ్యాయని ఆయన చెప్పారు. విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులను భయపెడుతున్నారని, అవమానిస్తున్నారని తెలిపారు. పరిశోధన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉందని చెప్పారు. ఆదివాసీ గిరిజనుల జాతి స్వచ్ఛతను పరీక్షించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టుకు కేంద్ర సాంస్కృతిక శాఖ నిధులు ఇచ్చినప్పుడు 150 మంది శాస్త్రవేత్తలు వ్యతిరేకించారని గుర్తు చేశారు. సంస్కృత భాష నేర్చుకొని దేశాన్ని 'విశ్వగురు'గా మార్చాలన్న కేంద్ర ప్రతిపాదనను కూడా శాస్త్రవేత్తలు నిరసించారని తెలిపారు. ఇటీవల చార్లెస్ డార్విన్ సిద్ధాంతాన్ని సైన్స్ పుస్తకాల నుంచి తొలగించినప్పుడు కూడా ఇదే విధమైన వ్యతిరేకత వ్యక్తమైందని అన్నారు. డార్విన్ సిద్ధాంతం స్థానంలో మనుస్మృతి, పురాణాలను చేర్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో సైన్స్‌ను రక్షించుకోవాలని, అలా చేస్తే ప్రజాస్వామ్యాన్ని కూడా రక్షించినట్లే అవుతుందని తెలిపారు. శాస్త్రీయ నైపుణ్యం దాడికి గురవుతోందని జవహర్‌లాల్ యూనివర్సిటీకి చెందిన ధృవ్ రైనా వాపోయారు. సైన్స్ అనేది ఏ ఒక్కరికో పరిమితం కాదని, అది అందరి ఉమ్మడి కృషి అని చెప్పారు. అశాస్త్రీయ పద్ధతులను పాటించడం వల్ల తల్లులు, గర్భస్థ శిశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోందని శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ అంబరీష్ సాత్విక్ హెచ్చరించారు. జ్యోతిష్యులు నిర్ణయించిన సమయానికి ప్రసవం కావాలంటూ కొందరు తల్లిదండ్రులు వైద్యులపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన తెలిపారు. ఇది మూఢనమ్మకమే తప్పించి మరొకటి కాదని అన్నారు. శాస్త్రవేత్తల మధ్య నిరంతరం చర్చలు జరగకపోవడం ప్రస్తుత సంక్షోభానికి ఒక కారణమని ప్రముఖ చరిత్రకారిణి రొమీలా థాపర్ చెప్పారు. చరిత్ర, శాస్త్రం మధ్య కొన్ని వైరుధ్యాలు ఉన్నాయని ఆమె అన్నారు.

గ్రామీణాభివృద్ధిని గాలికొదిలేశారు

- అర్హత గల బీడీ కార్మికులకు పక్కా ఇళ్లు
- యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ
- యాత్రకు నాలుగు రోజులు విరామం



లోకేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం మైనార్టీలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణాభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. అర్హత ఉన్న బిడి కార్మికులందరికీ ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర 110వ రోజుకు చేరుకుంది. గురువారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని ఎన్.కొత్తపల్లె విడిది కేంద్రం నుంచి పెద్దపసుపుల జంక్షన్, పెద్దపసుపుల, పెద్దపసుపుల చావిడి, జమ్మలమడుగు బైపాస్ విడిది కేంద్రం వరకూ సాగింది.

ఆయా ప్రాంతాల్లో ముస్లిములు, క్రిష్టియన్లు, రైతులతో మాటామంతి, ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ.. గ్రామాలకు నిధులివ్వకపోగా, గ్రామ పంచాయతీల్లోని రూ.8,660 కోట్లను సర్పంచ్‌లకు తెలియకుండా దొంగిలించారన్నారు. టిడిపి హయాంలో గ్రామాల్లో 25 వేల కి.మీ సిసి రోడ్లు, 30 లక్షల ఎల్ఇడి లైట్లు వేశామని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కుందూనది ముంపు సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తామని, రాజోలి ప్రాజెక్టును 2.95 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించి, నిర్వాసితులందరికీ పరిహారం అందజేస్తామని హామీనిచ్చారు. కర్నూలు, అనంతపురం వంటి పెద్దాసుపత్రుల్లో కనీసం దూదికి కూడా దిక్కులేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దళితకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానాడు కార్యక్రమం వల్ల ఈ నెల 26, 27, 28, 29వ తేదీల్లో యాత్రకు విరామం ప్రకటించినట్లు యువగళం మీడియా కో-ఆర్డినేటర్ తెలిపారు. తిరిగి 30న యాత్ర పునఃప్రారంభమవుతుందని తెలిపారు

ఆధునిక బానిసత్వంలో అభాగ్యులు

- భారత్‌లో 1.1 కోట్ల మంది
- వాక్ ఫ్రీ' నివేదిక వెల్లడి

లండన్ : ఇటీవలి సంవత్సరాలలో ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్న ప్రజల సంఖ్య పెరుగుతోందని ఓ అధ్యయన నివేదిక తెలిపింది. మానవ హక్కుల సంస్థ 'వాక్ ఫ్రీ' బుధవారం నాడు లండన్‌లో 'ప్రపంచ బానిసత్వ సూచిక'ను విడుదల చేసింది. దీని ప్రకారం 2021లో ప్రపంచంలోని ఐదు కోట్ల మంది అభాగ్యులు ఆధునిక బానిసత్వ సంకెళ్లలో బందీలయ్యారు. ఐదేళ్ల కిందట నాటి అంచనాలతో పోలిస్తే ఈ సంఖ్య కోటికి పైగా పెరిగింది. సాయుధ ఘర్షణలు, పర్యావరణ అసమతుల్యత, కోవిడ్ ప్రభావాలతో పాటు పలు అంశాలు ఈ పెరుగుదలకు కారణాలయ్యాయి.

బలవంతంగా పనిలో దింపడం, అప్పులు తీర్చడానికి విధిలేని పరిస్థితుల్లో పనికి పోవడం, నిర్బంధ వివాహాలు, మానవ అక్రమ రవాణా... ఇవన్నీ ఆధునిక బానిసత్వానికి ఉదాహరణలేనని నివేదిక తెలిపింది. ఈ తరహా బానిసత్వం మనకు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లోనూ కన్పిస్తోంది. ప్రతిరోజూ ప్రజలను ఏదో ఒక రూపంలో బానిసలుగా మారుస్తున్నారు. ఈ బతుకు నుంచి వారు బయటపడలేకపోతున్నారు. వారు తయారు చేసే ఉత్పత్తులను మనం కొనుగోలు చేస్తున్నాం. లేదా వారి సేవలు పొందుతున్నాం. దాని వెనుక ఉన్న మానవ శ్రమను గుర్తించలేకపోతున్నాం. ఈ నివేదిక ప్రకారం బలవంతంగా పనిలో చేరుతున్న వారి సంఖ్య 2.76 కోట్లు కాగా, బలవంతపు వివాహాలతో బానిస బతుకులు బతుకుతున్న వారు 2.2 కోట్ల మంది. ప్రపంచంలోని ప్రతి 150 మందిలోనూ ఒకరు బానిసత్వంలో మగ్గిపోతున్నారు. ఆధునిక బానిసత్వ బాధితుల సంఖ్య ఎరిత్రియా, మారిటేనియా దేశాలలో ఎక్కువగా ఉంది. మొదటి పది స్థానాల్లో సౌదీ అరేబియా, టర్కీ, యుఎఇ, కువైట్ కూడా ఉన్నాయి. జి-20 దేశాలలో కూడా అనేకమంది ప్రజలు దోపిడీకి గురవుతున్నారు. ఈ నివేదిక ప్రకారం భారత్‌లో 1.1 కోట్ల మంది కట్టు బానిసలుగా మారి బతుకు బండిని లాగిస్తున్నారు.

బానిసత్వంలో వివిధ దేశాల మధ్య కొన్ని రాజకీయ, సామాజిక, ఆర్థిక పరమైన సామీప్యతలు ఉన్నాయి. అక్కడ పౌర స్వేచ్ఛ, మానవ హక్కులకు రక్షణ తక్కువగా ఉంటుంది. ఆధునిక బానిసత్వ ప్రభావం ఎక్కువగా ఉన్న దేశాలలో ఘర్షణలు, రాజకీయ అస్థిరత, నియంతృత్వ పోకడలు కన్పిస్తాయి. శరణార్థులు, వలస కార్మికుల సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. వీరికి ఆయా దేశాల పౌరులకు ఉండే న్యాయపరమైన రక్షణ ఉండదు. కాబట్టి వీరు దోపిడీకి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అనేక దేశాలలో ప్రభుత్వాలే తమ పౌరులను వివిధ రంగాలలో బలవంతంగా పనిలో దింపుతుంటాయి.

మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలి


- ఎపిఇపిడిసిఎల్ రీడర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎపిఇపిడిసిఎల్ పరిధిలో మీటర్ రీడర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిఇపిడిసిఎల్ మీటర్ రీడర్స్ యూనియన్ (సిఐటియు) ఐదు జిల్లాల సదస్సు డిమాండ్ చేసింది. మీటర్ రీడర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో గురువారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. డోర్ లాక్, నాన్ స్కాన్ పేర్లతో జీతాల్లో కోత విధించడం అన్యాయమన్నారు. కటింగ్ చేసిన సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలోనూ, మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లోనూ మీటర్ రీడర్లకు న్యాయం చేస్తామని చెప్పి..నాలుగేళ్లు దాటినా సమస్యను పరిష్కరించలేదన్నారు. ఎపివిఎంఆర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మూడు కంపెనీల పరిధిలో 4600 మంది మీటర్ రీడర్లుగా పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న స్పాట్ బిల్లింగ్‌ను ఏ రకంగా కుదించినా వారికి తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. సదస్సు అనంతరం యూనియన్ నాయకులు ఎపిఇపిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్‌కు వినతి పత్రం అందజేశారు.

జర్మనీలో ఆర్థిక సంక్షోభం

- జిడిపి 0.3 శాతానికి పతనం



బెర్లిన్ : ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ జర్మనీ మాంద్యంలోకి జారుకుంది. ద్రవ్యోల్బణం కట్టడిలో విఫలం కావడంతో సంక్షోభ పరిస్థితులు చోటు చేసుకున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో ఆ దేశ జిడిపి ఏకంగా 0.3 శాతానికి పతనమయ్యింది. 2022 నాలుగో త్రైమాసికంలోనూ 0.5శాతం క్షీణించింది. ముఖ్యంగా ఉక్రెయిన్, రష్యా యుద్ధ పరిణామాల తర్వాత జర్మనీలో గ్యాస్ సరఫరాలు మందగించాయి. ఇది ఆ దేశ ఆర్థిక వ్యవస్థపై ఎక్కువగా ప్రభావం చూపింది. గడిచిన రెండు త్రైమాసికాల్లోనూ జర్మనీ ప్రజల కొనుగోలు శక్తి 1.2 శాతం తగ్గిపోయింది. ప్రభుత్వం చేసే వ్యయంలోనూ 4.9 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. ఆర్థిక వ్యవస్థ బలహీనంగా చోటు చేసుకోవడంతో స్టాక్ మార్కెట్లు కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ ఏడాది జర్మనీలో ద్రవ్యోల్బణం 7.2 శాతంగా చోటు చేసుకుంది. ఇది యురోపియన్ దేశాల సగటు కన్నా ఎక్కువ కావడంతో ఆందోళనలు పెరిగాయి. హెచ్చు ద్రవ్యోల్బణంతో ఆహారం, దుస్తులు, ఫర్నీచర్లు కొనడం కోసం ప్రజలు ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోంది. అధిక ఇంధన ధరల వల్ల పరిశ్రమల ఉత్పత్తులకు ఆర్డర్లు తగ్గడంతో ఆర్థిక వ్యవస్థ మరింత మందగిస్తోంది. 2023 ఏడాది ఆరంభం నుంచి ధరలు అధికంగా ఉండడం వల్ల జర్మనీ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడిందని డీస్టాటిస్ ఏజెన్సీ విశ్లేషించింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం, పారిశ్రామిక ప్రగతి మందగించడం, కఠినమైన ద్రవ్యపరపతి విధానంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకులు వంటివి బలహీన ఆర్థిక వ్యవస్థకు కారణమని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు వారాల్లో బిఎస్ఎన్ఎల్ 4జి ట్రయల్ రన్

- మంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడి




న్యూఢిల్లీ : వచ్చే రెండు వారాల్లోనే బిఎస్ఎన్ఎల్ 4జి నెట్‌వర్క్ సేవలను ట్రయల్ రన్‌గా ప్రారంభించనున్నామని టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. వచ్చే ఒక్కటి, రెండేళ్లలో 10 కోట్ల మంది 4జి వినియోగదారులను చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం దేశంలో 110 కోట్ల మంది వినియోగదారులుండగా.. అందులో 76.9 కోట్ల 4జి ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్ సంస్థలకు మొత్తంగా 10.5 కోట్ల టెలికం సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. మొత్తం మార్కెట్‌లో 9.1 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ ఏడాది ముగింపు నాటికి బిఎస్ఎన్ఎల్ 5జి సేవలను ప్రారంభించే యోచనలో ఉన్నామని మంత్రి వైష్ణవ్ తెలిపారు.

వండర్‌లా హాలిడేస్‌కు రూ.35 కోట్ల లాభాలు

బెంగళూరు : వినోద పార్కుల నిర్వహణ సంస్థ వండర్‌లా హాలిడేస్ 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.35.05 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.38.9 కోట్ల లాభాలు ఆర్జించింది. దీంతో పోల్చితే గడిచిన త్రైమాసికంలో 10 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. క్రితం మార్చి త్రైమాసికంలో రూ.112.63 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2022 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఇది రూ.117.75 కోట్లుగా ఉంది. ఈ సంస్థ హైదరాబాద్, కొచ్చి, బెంగళూరులో వండర్‌లా పార్కులను కలిగి ఉంది.

రూ.25 లక్షల వరకు పన్ను మినహాయింపు

- పదవీ విరమణ చేసే వారికి అవకాశం



న్యూఢిల్లీ : ఉద్యోగస్తుల పదవీ విరమణ సమయంలో వచ్చే మొత్తంపై కేంద్రం పన్ను మినహాయింపు పరిమితిని పెంచింది. పదవీ విరమణ సమయంలో ఉద్యోగులు పొందే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ప్రయోజనాల కోసం పన్ను మినహాయింపు పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం వెల్లడించారు. ఇంతక్రితం ఈ పరిమితి రూ.3 లక్షల వరకు మాత్రమే ఉంది. పన్ను మినహాయింపు పెంపు పరిమితి నిర్ణయం 2023 ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చిందని రెవెన్యూ శాఖ తెలిపింది. రిటైర్‌మెంట్ సమయంలో వేతన జీవులు పొందే మొత్తంలో రూ.25 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తామని 2023-24 కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. తాజా నిర్ణయంతో 33 ఏళ్ల పాటు పని చేసే ఉద్యోగులకు ప్రతీ ఏడాది సగటున రూ.20వేలు చొప్పున పన్ను ఆదా కానుందని మల్హోత్రా పేర్కొన్నారు.

రాణించిన అబాన్స్ హోల్డింగ్స్

ముంబయి : ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ అబాన్స్ హోల్డింగ్స్ లిమిటెడ్ గతేడాది మెరుగైన ప్రగతిని కనబర్చినట్లు తెలిపింది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 14 శాతం వృద్ధితో రూ.70.3 కోట్ల నికర లాభాలు సాధించినట్లు వెల్లడించింది. ఇంతక్రితం ఏడాదిలో రూ.61.8 కోట్ల లాభాలు నమోదు చేసినట్లు పేర్కొంది. ఇదే సమయంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.638.62 కోట్లతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సరంలో 80.2 శాతం వృద్ధితో రూ.1,150.97 కోట్లుగా చోటు చేసుకుంది.

హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్ ఎయుఎంలో భారీ వృద్ధి

ముంబయి : హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పిఎస్)లో 2023 మే 15 నాటికి రూ.50,000 కోట్ల అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) నిధుల మార్కును చేరినట్లు ప్రకటించింది. 2020లో రూ.10వేల కోట్ల ఆస్తులు ఉండగా.. 33 నెలల్లోనే 400 శాతం వృద్ధిని సాధించినట్లు పేర్కొంది. "ఇది మాకు చాలా గర్వకారణమైన సమయం. రూ.50,000 కోట్లు ఎయుఎం మైలురాయిని దాటినందుకు సంతోషిస్తున్నాము. ఈ ఏడాది పదేళ్ల వ్యాపారాన్ని పూర్తి చేసుకునే సమయంలో ఈ విజయం మరింత ముఖ్యమైంది." అని హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్ సంస్థ సిఇఒ శ్రీరామ్ అయ్యర్ తెలిపారు.

సంపాదకీయం


ఎవరికోసం?

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు దేశాల పర్యటన ముగించుకొని గురువారం తిరివచ్చారు. రాబోయే మరో 40 రోజుల్లో అమెరికాతో సహా పలు దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నది నానుడి. కానీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచీ ప్రధాని హోదాలో మోడీ చేస్తున్న విదేశీ పర్యటనలు గమనిస్తే ఇంట ఓడినప్పుడు లేదా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తున్నప్పుడల్లా గోడీ మీడియా బాకాల సహకారంతో 'బయట భళా' అనిపించుకోవడం రివాజుగా మారింది. ప్రస్తుతం దేశంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నిరుద్యోగం కోరలు చాచి అంతకంతకూ విస్తరిస్తోంది. ద్రవ్యోల్బణం రంకెలేస్తోంది. బేటీ బచావో..బేటీ పడావో నినాదాలను అవహేళన చేసేలా అధికార బిజెపి నేతలే అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులను నిరసిస్తూ జంతర్‌మంతర్ వద్ద ప్రఖ్యాత రెజ్లర్లు నిరవధిక ఆందోళన చేస్తున్నారు. కర్ణాటక ఎన్నికల్లో మతవిద్వేషాలు రాజేసి లబ్ది పొందాలని చూసినా.. అక్కడి ఓటర్లు కొర్రు కాల్చి వాతపెట్టడంతో బిజెపి దిమ్మ తిరిగింది. నూతన పార్లమెంటు భవన సముదాయానికి ఆహ్వానించకుండా తొలి ఆదివాసీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోడీ సర్కార్ అవమానిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిపక్ష పార్టీలు ఈ కార్యక్రమాన్ని ఇప్పటికే బహిష్కరించాయి. వరుసగా చుట్టుముట్టిన ఈ ఇబ్బందులు, పరాభవాల నుంచి ప్రజల దృష్టి మళ్లించి 'లోకనాయకుడి'గా టామ్‌టామ్ లేసుకునేందుకు మోడీ తన విదేశీ పర్యటనలను రూపొందించినట్లు ఆయన పర్యటనల తీరు చూస్తుంటే తెలిసిపోతోంది.

దేశాభివృద్ధి కోసం ప్రపంచ దేశాలతో సత్సంబంధాలు తప్పనిసరి. దేశాధినేతల పర్యటనలు ఇందుకు దోహదం చేస్తాయి. కానీ ఇరుగుపొరుగు దేశాలతో మైత్రిని పెంపొందించుకొని బహుళ ధ్రువ ప్రపంచాన్ని కోరుకునేలా దౌత్యనీతిని, విదేశాంగ విధానాలను మలచుకోవడం సార్వభౌమత్వం కలిగిన ఏ దేశమైనా చేసే పని. మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అమెరికా ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. ఏ దేశానికి వెళ్లినా భారీ సభలు నిర్వహించడం, ప్రవాస భారతీయులతో వేడుకులు జరుపుకోవడం ఆయన పర్యటనలో తప్పనిసరి. తాజా విదేశీ పర్యటనల్లోనూ అదే తీరు. జపాన్ ఆహ్వానంతో జి7 దేశాల శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ హాజరుకావడం, చైనాకు వ్యతిరేకంగా ఆ దేశాలు చేసిన తీర్మాణానికి ఔననలేక కాదనలేక ఇబ్బందులు పడటం చూశాం. అక్కడితో మోడీ తన పర్యటనను సరిపెట్టివుంటే పెద్ద చర్చనీయాంశం అయ్యేది కాదు. జి7 సమావేశాల తర్వాత పపువా న్యూగినియాకు వెళ్లి అక్కడ జరిగిన భారత్-పసిఫిక్ దీవుల దేశాధినేతల సమావేశంలోనూ మోడీ పాలుపంచుకున్నారు. అమెరికా విదేశాంగ మంత్రి పపువా న్యూగినియాతో రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న మరుసటి రోజే మోడీ ఈ దేశాన్ని సందర్శించడంలో ఉద్దేశం తెలియనదేమీ కాదు.

చైనాకు పక్కలో బల్లెంలా నాటో అనుబంధ సైనిక కూటమి తయారీ లక్ష్యంగా అమెరికా రూపొందించిన వ్యూహంలో భాగమే ఇది. చతుష్టీయ కూటమి (క్వాడ్) దేశాల సమావేశం రద్దు అయినా అమెరికా నిర్దేశించిన లక్ష్యాన్ని మోడీ భుజాన వేసుకున్నట్లు కనిపిస్తోంది. ఆ తర్వాత మోడీ ఆస్ట్రేలియాలో పర్యటించారు. కోవిడ్ వైరస్ సృష్టించి ప్రపంచాన్ని చైనా నాశనం చేస్తోందంటూ మహమ్మారి విజృంభణ సమయంలో అమెరికా చేసిన దుష్ప్రచారానికి వంత పాడిన దేశాల్లో ఆస్ట్రేలియా కూడా ఒకటి. మోడీ పర్యటనకు ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ అమితానందంతో స్వాగతం పలికారు. 'బాస్' అంటూ కీర్తించారు. మోడీ సన్నిహితుడు గౌతమ్ అదానీకి విద్యుత్ ప్రాజెక్టులను ఆస్ట్రేలియాలో కట్టబెట్టడం, పర్యావరణం నాశనమవుతోందని అక్కడి ప్రజలు తీవ్ర వ్యతిరేకత తెలిపినా మునుపటి మోరిసన్ సర్కార్ అదానీ సేవలో తరించడం, ఇప్పుడు ఆయన వారసుడు మోడీకి ఘన స్వాగతం పలికారా? అమెరికాకు అంటకాగుతూ క్రోనీ మిత్రుల ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకే మోడీ విదేశీ పర్యటనలు అని ఇవన్నీ చూస్తే అర్థమైపోతుంది.

మహనీయుల మాట




విజ్ఞానం ద్వారా బలమైన తాత్వికత, నిజాయితీ, బుద్ధి కుశలత లభిస్తాయి. శ్రమ పట్ల గౌరవం ఏర్పడుతుంది.

- గోర్కీ
ప్రసిద్ధ రష్యన్ రచయిత

రాష్ట్ర జిడిపిలో ప్రజా జీవితాలకు చోటేది?

విశ్లేషణ



> రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయడంలేదనేది స్పష్టమౌతున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో, ప్రజల జీవితాల్లో తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు పేదరికం, నిరుద్యోగం తగ్గక పోగా ఆదాయ అసమానతలు, జిల్లాల మధ్య అంతరాలు ఎక్కువవుతున్నాయి.

రాష్ట్రంలో పెరుగుతున్న రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (ఎస్‌జిడిపి)పై గత కొంత కాలంగా చర్చ నడుస్తున్నది. తమ ప్రభుత్వ విధానాల వల్లే జిడిపి వేగంగా పెరుగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నది. అంతేకాక పెరుగుతున్న జిడిపి వల్ల రాష్ట్రంలో అభివృద్ధితో పాటు ప్రజా జీవనం అన్ని విధాలుగా మెరుగు పడుతున్నదని, పేదరికం, నిరుద్యోగం బాగా తగ్గిపోతున్నదని, ప్రాంతాల మధ్య అసమానతలు కూడా తగ్గుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సామాజిక, ఆర్థిక సర్వే 2022-23 ప్రకారం రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి రూ.13.17 లక్షల కోట్లకు చేరింది. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ. 2.19 లక్షలుగా నమోదయ్యింది. ఇది దేశ సగటు తలసరి ఆదాయం కంటే ఎక్కువగా కూడా ఉంది. దేశ జిడిపిలో రాష్ట్రం 8వ స్థానంలోను, దేశ సగటు తలసరి ఆదాయంలో 16వ స్థానంలో ఉంది. రాష్ట్ర జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 36.19 శాతం, పారిశ్రామిక రంగం వాటా 23.36 శాతం, సేవారంగం వాటా 40.45 శాతం ఉంది. ఈ మూడు రంగాల నుండి ఒక ఏడాదిలో వచ్చే ఆదాయాన్నే రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి అంటాం.



డా॥ బి.గంగారావు

ఈ అంకెలు, ప్రభుత్వ ప్రచారాన్ని బట్టి చూస్తే ఎవరైనా బోల్తా పడతారు. రాష్ట్రం బాగా అభివృద్ధి అవుతుందనే భ్రమల్లో పడతారు. కానీ రాష్ట్ర జిడిపిని లోతుగా పరిశీలిస్తే అభివృద్ధి ఎవరికి జరుగుతుందో? రాష్ట్రంలో సృష్టి అవుతున్న సంపద ఎవరి పరం అవుతున్నదో? రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో జరుగుతున్న ఆందోళనకర పరిణామాలు అర్థమౌతాయి. ఎస్‌జిడిపి అంకెల బండారం బయట పడుతుంది.

వ్యవసాయ రంగాన్నే చూద్దాం. వ్యవసాయ రంగం బాగా అభివృద్ధి అవుతున్నదని వ్యవసాయం మీద ఆధారపడ్డ వారి ఆదాయాలు బాగా మెరుగు పడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది. దీనికి రెండు ప్రధాన కారణాలను ప్రభుత్వం చూపుతున్నది. దేశ జిడిపిలో వ్యవసాయ రంగం వాటా బాగా పడిపోతున్నదని. ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం వ్యవసాయ రంగం వాటా పెరుగుతున్నదని, వ్యవసాయ రంగం వృద్ధిరేటు కూడా దేశానికి భిన్నంగా రాష్ట్రంలో ఎక్కువగా నమోదవుతున్నదని చూపుతున్నది. అంకెలు, ప్రభుత్వ ప్రకటనలు చూస్తే వాస్తవమేననే భావన కలుతుంది. కానీ లోతుల్లోకి వెళ్ళి విశ్లేషణ చేస్తే వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోవడంతో పాటు వ్యవసాయ రంగంలో పెట్టుబడి కేంద్రీకరణ వేగంగా పెరుగుతున్నట్లు మనకి అర్థమౌతుంది.

రాష్ట్ర జిడిపికి వ్యవసాయ రంగం నుండి 2022-23లో రూ. 4.39 లక్షల కోట్లు సమకూరింది. అదే ఏడాది వ్యవసాయ రంగ వృద్ధిరేటు 13.18గా నమోదయ్యింది. వ్యవసాయ రంగంలో ఆహార పంటలు, ఉద్యాన పంటలు, పశు, చేపలు, రొయ్యలు, అటవీ సంబంధిత విభాగాలు ఉంటాయి. దీనినే ప్రాథమిక రంగం అని కూడా అంటారు. వ్యవసాయం మీద ఇప్పటికీ రాష్ట్రంలో 62.17 శాతం మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరిలో 25 శాతం మంది ఆహార పంటల మీదే జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయ రంగంలో మిగిలిన వాటి మీద ఆధారపడే వారు చాలా తక్కువ మంది మాత్రమే.

వ్యవసాయ రంగంలో గత ఏడాదిలో వచ్చిన సంపదను పరిశీలిస్తే అత్యధిక మంది ప్రజలు ఆధారపడ్డ ఆహార పంటల నుండి కేవలం 12.13 శాతం మాత్రమే సృష్టించబడింది. మిగిలిన ఉద్యానవనాలు 28.09 శాతం, పశు సంబంధిత ఆదాయం 32.06 శాతం, చేపలు, రొయ్యలు 25.29 శాతం, అటవీ సంపద నుండి 2.21 శాతం సమకూర్చబడింది. సుమారు 60 శాతం ఆదాయం వ్యవసాయ రంగంలో చేపలు, రొయ్యలు, పౌల్ట్రీ, ప్లాంటేషన్‌ల నుండి వస్తున్నదనేది స్పష్టమౌతున్నది. ఇంకా ఆశ్చర్యం కలిగించే అంశమేమంటే రొయ్యలు, చేపల చెరువుల నుండి రూ.1.11 లక్షల కోట్లు ఆదాయం వస్తే, ఆహార పంటల నుండి కేవలం రూ.54, 161 కోట్లు మాత్రమే వచ్చింది. అదే 2011-12లో చూస్తే ఆహార పంటల నుండి రూ.29.282 కోట్లు వస్తే చేపలు, రొయ్యల నుండి రూ.11,877 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. గడిచిన పదేళ్ళలో వ్యవసాయంలో ఆహార ధాన్యాల పంటల కన్నా చేపలు, రొయ్యల సాగు ఆదాయం రెండు రెట్లు పెరిగింది. ఆహార ధాన్యలు పండించే రైతులు సుమారు 50.92 లక్షల మంది (కౌలు రైతులు మినహా) ఉండగా చేపల, రొయ్యల సాగు చేసే రైతులు కేవలం 61,682 మంది మాత్రమే ఉన్నారు. అలాగే గత దశాబ్దం నుండి రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 155 లక్షల టన్నుల చుట్టే తిరుగుతున్నది. తలసరి ఆహార ధాన్యాల వినియోగం బాగా తగ్గింది. ఆహార ధాన్యాలు పండించే భూమి ఈ కాలంలో 44 లక్షల హెక్టార్ల నుండి 39.59 లక్షల హెక్టార్లకు తగ్గిపోయింది.

> వ్యవసాయ రంగం మీద ఆధారపడ్డ అత్యధిక మంది ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా ఆహార పంటల నుండి భూమి వ్యవసాయేతర కార్యకలాపాలకు, పెద్ద పెట్టుబడులతో సాగయ్యే కార్యకలాపాలకు మార్పిడి జరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి సమస్య జఠిలం అవుతున్నది. వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య కార్యకలాపాలు పెద్దపెద్ద పెట్టుబడులకు కేంద్రమౌతున్నాయి. సంపద కేంద్రీకృతమౌతున్నది.

మొత్తంగా చూస్తే వ్యవసాయ రంగంలో 85 శాతం ప్రజల ఆదాయాలు నామమాత్రంగా ఉన్నాయనేది స్పష్టమౌతున్నది. ప్రభుత్వం చేస్తున్న ప్రచారంలో వాస్తవం కనిపించటం లేదు. వ్యవసాయ రంగం నుండి వచ్చే ఆదాయంలో అత్యధిక భాగం కొద్ది మందికి మాత్రమే వెళ తున్నది. ఈ పరిణామం వ్యవసాయ రంగంలో సంపద, భూ కేంద్రీకరణ, రైతులు, భూములు కోల్పోవటం వంటి చర్యలకు దారి తీస్తున్నది. ఫలితంగా అత్యధిక రైతాంగం సంక్షోభంలోనే కొనసాగుతున్నారు. ఈ వాస్తవ పరిస్థితిని ఎస్‌జిడిపి అంకెలు మరుగున పరుస్తున్నాయి. ఈ దుస్థితిలో గ్రామీణ ప్రజలు ఎక్కువభాగం కుటుంబ పోషణ కోసం పాడి పరిశ్రమను ముఖ్యమైన వృత్తిగా మార్చుకున్నారు. ఫలితంగా మన రాష్ట్రం పాల ఉత్పత్తిలో దేశంలో 5వ స్థానంలో నిలిచింది.

ఇక పారిశ్రామిక రంగం చూస్తే రాష్ట్ర జిడిపిలో దీని వాటా క్రమంగా తగ్గిపోతున్నది. రాష్ట్ర విభజన అనంతరం 2013-14లో రాష్ట్ర జిడిపిలో పరిశ్రమల వాటా 25.17 శాతం ఉంటే 2022-23కి 23.36కి పడిపోయింది. 2.83 లక్షల కోట్ల సంపద సృష్టి అయ్యింది. వస్తు తయారీ రంగం చూస్తే ఎదుగుబొదుగు లేకుండా జిడిపిలో 10 శాతం చుట్టే తిరుగుతున్నది. పారిశ్రామిక నిర్మాణ రంగం వాటా కూడా గత తొమ్మిదేళ్ళల్లో జిడిపిలో 9.53 శాతం నుండి 6.91 శాతానికి క్షీణించింది. పారిశ్రామిక రంగం మీద ఆధారపడ్డ జనాభా చూస్తే కేవలం 18 శాతానికి మించి లేరు. ప్రస్తుత ప్రభుత్వంతో పాటు గత తెలుగుదేశం ప్రభుత్వం కూడా రాష్ట్ర పారిశ్రామికీకరణ గురించి తెగ గొప్పలు చెప్పారు. ఐటీ హబ్‌లు, పారిశ్రామిక క్లస్టర్లు, గ్రోత్ సెంటర్లు, కారిడార్లు...ఎక్కువ భాగం నత్తనడకనే సాగుతున్నాయి. ఇక అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుల పేర రూ.లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్నాయని ప్రకటనలు చేస్తున్నారు. కాని వాస్తవ పరిస్థితి తలకిందులుగా ఉంది. సహకార రంగంలోని చెక్కర, డెయిరీ వంటి పరిశ్రమలతోపాటు జూట్ మిల్లులు అనేకం మూతబడ్డాయి. ప్రభుత్వ పెట్టుబడులున్న పరిశ్రమలను, సహజ వనరులను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తూ భారీగా రాయితీలు ఇస్తున్నారు. పారిశ్రామిక రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల కల్పన స్తంభించిపోయింది.

మూడోది సేవారంగం. ఈ రంగం వాటా కూడా రాష్ట్ర జిడిపిలో 2013-14 లో 44.61 శాతం ఉంటే 2022-23కి 40.45 శాతానికి క్రమేణా తగ్గుతూ వచ్చింది. మరో ముఖ్య మైన పరిణామం ఏమంటే సేవా రంగంలో మూడో వంతు ఆదాయం రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ రంగాల నుండి రావడం.

2022-23లో సేవారంగం నుండి రూ.4.91 లక్షల కోట్ల సంపద సృష్టి అయ్యింది. ఇందులో రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ కార్యకలాపాల నుండి రూ.1.54 లక్షల కోట్లు వచ్చింది. ఈ రంగంలో అతి తక్కువ ఉపాధి అవకాశాలు మాత్రమే కల్పించబడతాయి. ఉపాధి అవకాశాలు తక్కువగా కల్పించబడే కార్యకలాపాల నుండి సేవా రంగానికి ఎక్కువ ఆదాయం వస్తున్నట్లు స్పష్టమౌతున్నది. ఫలితంగా రాష్ట్ర జిడిపిలో 40.45 శాతం వాటా కలిగిన సేవారంగం మీద కేవలం 20 శాతం మంది మాత్రమే ఉపాధి పొందుతున్నారు. ఈ రంగంలో సృష్టించబడుతున్న ఆదాయంలో అతి తక్కువ మాత్రమే వేతనాల రూపంలో ఈ రంగంలోని ప్రజలకు దక్కుతున్నాయి. ఈ రంగంలో సంపద కేంద్రీకరణ తీవ్రంగా ఉన్నట్లు రూఢీ అవుతున్నది.

రాష్ట్ర సగటు తలసరి ఆదాయం పెరుగుదలను కూడా అభివృద్ధిగా చూపించటం మరోటి. దేశ సగటు తలసరి ఆదాయం కంటే గత దశాబ్దం నుండి రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువగా కొనసాగటం వల్ల పేదరికం కూడా బాగా తగ్గిందనే ప్రచారం కూడా చేస్తున్నారు. కేంద్ర బిజెపి సర్కార్ సైతం తన విధానాల వల్లనే ప్రపంచంలో భారతదేశం 5వ ఆర్థిక వ్యవస్థగా రూపొందిందని గొప్పలు చెప్పుకుంటున్నది. కాని పోగుపడుతున్న జిడిపి లేదా సంపద ప్రజలకు కింది దాకా పున:పంపిణీ కావటం లేదు. పైన వ్యవసాయ రంగంలో పేర్కొన్నట్లు కొద్ది మంది చేతుల్లో కేంద్రీకరణ జరుగుతున్నది. నయా ఉదారవాద విధానాలు ప్రారంభం నుండి బూర్జువా ఆర్థికవేత్తలు, పాలకులు చెప్పుకుంటూ వస్తున్న ట్రికిల్ డౌన్ సిద్ధాంతం ఆచరణలో పెద్ద డొల్లతనంగా మారింది.

ఇక రాష్ట్ర సగటు తలసరి ఆదాయం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చూస్తే 13లో 9 జిల్లాలు రాష్ట్ర తలసరి సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నాయి. కేవలం విశాఖపట్నం, కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలు మాత్రమే రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కంటే ఎక్కువ ఆదాయం కలిగి ఉన్నాయి. కొత్త జిల్లాల ఆధారంగా జిల్లాల తలసరి ఆదాయాలు ప్రభుత్వం విడుదల చేస్తే జిల్లాల మధ్య ఆర్థిక అసమానతలు, వెనుకబాటు ఎంత తీవ్ర స్థాయిలో ఉన్నాయో మనకు అర్థమౌతుంది.

పారిశ్రామిక రంగానికి విశాఖపట్నం, భోగాపురం, శ్రీ సిటీ వంటి కేంద్రాలు మాత్రమే ప్రధానమైనవిగా ఉన్నాయి. చేపలు, రొయ్యలు, చెరువులు, పౌల్ట్రీ, ప్లాంటేషన్‌లకు కృష్ణా, పశ్చిమ గోదావరి, నెల్లూరు వంటి కొన్ని జిల్లాలు మాత్రమే కీలకంగా ఉన్నాయి. సేవారంగం కేవలం కొన్ని పెద్ద నగరాలకే పరిమితమై ఎక్కువ ఆదాయాన్ని జిడిపికి సమకూరుస్తున్నది.

పెరుగుతున్న జిడిపి రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యకు ఏమాత్రం పరిష్కారం చూపడంలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 6.15 శాతంగా ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన లేబర్ ఫోర్స్ సర్వే 2020-21 తెలిపిన వివరాలు చూస్తే ఆంధ్ర రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర జనాభాలో 48.4 శాతం ప్రజలు శ్రామికులుగా వివిధ పనుల్లో జీవనం సాగిస్తున్నారు. దేశంలో శ్రామిక భాగస్వామ్యం తక్కువగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్ర రాష్ట్రం ఒకటిగా వుంది. 15-29 వయస్సు మధ్య చూస్తే అతి తక్కువ మంది అనగా పట్టణ ప్రాంతంలో 17 శాతం, గ్రామీణ ప్రాంతంలో 32.9 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. పట్టభద్రులలో చూస్తే ప్రతి 10 మందిలో నలుగురు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా ఉన్నారు. మొత్తం చదువుకున్న నిరుద్యోగుల్లో 73 శాతం మంది పట్టభద్రులే. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్‌లలో ఉద్యోగాల కోసం నమోదు చేసుకున్నవారు 16 లక్షల మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం పేదలకు ముఖ్యమైన ఉపాధిగా ఉంది. ఇంజనీరింగ్ చదువుకున్న పట్టభద్రుడికి రాష్ట్రంలో కనీస స్థాయి వేతనం పొందగలిగే ఉపాధి లేదు. అత్యధిక మంది రాష్ట్రం వదిలి ఇరత రాష్ట్రాలకు పని కోసం వలస వెళ్తున్నారు.

మరో పరిణామమేమంటే సంఘటిత రంగంలో ఉపాధి తగ్గిపోయి అసంఘటిత రంగం పెరుగుతున్నది. ఉపాధి కల్పనలో ప్రభుత్వ పెట్టుబడులు బాగా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయటంలేదు. ఫలితంగా సంఘటిత రంగంలో ఉపాధి దారుణంగా పడిపోతున్నది. ప్రైవేటు రంగంలో కూడా సంఘటిత ఉపాధి నామమాత్రంగా మారింది. శ్రమ దోపిడి తీవ్రంగా ఉంది.


రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రాష్ట్ర ప్రజల అభివృద్ధికి ఏమాత్రం దోహదం చేయడంలేదనేది స్పష్టమౌతున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆర్థిక వ్యవస్థలో, ప్రజల జీవితాల్లో తీవ్ర సమస్యలు సృష్టిస్తున్నాయి. ప్రభుత్వం చెబుతున్నట్లు పేదరికం, నిరుద్యోగం తగ్గక పోగా ఆదాయ అసమానతలు, జిల్లాల మధ్య అంతరాలు ఎక్కువవుతున్నాయి. వ్యవసాయ రంగం మీద ఆధారపడ్డ అత్యధిక మంది ప్రజల జీవితాలు మెరుగు పడకపోగా ఆహార పంటల నుండి భూమి వ్యవసాయేతర కార్యకలాపాలకు, పెద్ద పెట్టుబడులతో సాగయ్యే కార్యకలాపాలకు మార్పిడి జరుగుతున్నది. ఫలితంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి సమస్య జఠిలం అవుతున్నది. వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య కార్యకలాపాలు పెద్దపెద్ద పెట్టుబడులకు కేంద్రమౌతున్నాయి. సంపద కేంద్రీకృతమౌతున్నది.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కార్మికవర్గంపై అప్పుల అనకొండ దాడి!

వ్యాఖ్య

> ప్రతి సంక్షోభమూ ప్రతి చోటా గతంలో కార్మికవర్గ సంపాదించుకున్న హక్కులు, సామాజిక రక్షణలనూ హరిస్తున్నది. తప్పనిసరై కరోనా కాలంలో ఇచ్చిన మెడికల్ బీమా రాయితీలను సమీక్షించాలని రాష్ట్రాలను బైడెన్ ఆదేశించాడు. వాటిని గనుక రద్దు చేస్తే 53 నుంచి 142 లక్షల మంది వరకు వీధిన పడతారు. అందువలన ఇది ఒక్క అమెరికా సమస్యే కాదు. పెద్దన్న అడుగు జాడల్లో నడిచే ప్రతి చోటా అప్పుల అనకొండలు కార్మికవర్గం మీద దాడులకు దిగుతాయి.



జూన్ ఒకటవ తేదీ దగ్గర పడే కొద్దీ...తమ మీద ఎక్కడ పిడుగు పడుతుందో, ఎలా పడుతుందోనని ... అమెరికా కార్మికవర్గం, మధ్య తరగతిలో గుబులు పెరుగుతోంది. ఉరుము ఉరిమి ఓటి మంగలం మీద పడినట్లు దేశ రుణ పరిమితి గురించి అధికార డెమోక్రటిక్, ప్రతిపక్ష రిపబ్లికన్ల మధ్య వాద ప్రతివాదనల లాలూచీ తతంగం తమ మీద భారం ఎంత మోపుతుందనేదే వారి ఆందోళన. ప్రభుత్వ రుణ పరిమితి పెంపుదలపై ప్రజా ప్రతినిధుల సభలో మెజారిటీగా ఉన్న రిపబ్లికన్లు అంగీకరించకపోతే జనం మీద భారం పడుతుంది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో అంతా మీరే చేశారు, దీనంతటికీ మీరే కారణం అని డెమోక్రాట్ల మీద రాజకీయ దాడి చేసేందుకు ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ పెంపుదలకు నిరాకరిస్తుందా లేక చివరి వరకు మొరాయించి ఓట్ల కోసం అంగీకరిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. రుణ పరిమితి ఎంత పెరిగితే అంతగా జనం మీద భారాలు పెరగటం లేదా ఉన్న సౌకర్యాలకు కోత పడుతుంది.

ప్రపంచంలో అనేక దేశాలు రుణ ఊబిలో కూరుకు పోతున్నాయి. గత పాతిక సంవత్సరాల్లో ప్రత్యేకించి గడచిన పదేళ్లలో, కరోనాతో, కొనసాగుతున్న ఉక్రెయిన్ సంక్షోభంతో ఆదాయం తక్కువగా ఉండే దేశాల రుణాలు పెరిగాయి. డెబ్బయి మూడు దేశాలు అధిక రుణ భారంతో ఉండగా వాటికి ఉపశమనం కలిగించేందుకు జి-20 కూటమి చొరవ తీసుకొన్నది. వడ్డీ, అసలు చెల్లింపులను వాయిదా వేయించేందుకు అప్పులిచ్చిన వారితో చర్చలకు 2020-21 లోనే తెరతీసింది. నలభై ఒక్క దేశాలు ఇవాళా రేపా అన్నట్లుగా తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మన ఇరుగు పొరుగున ఉన్న శ్రీలంక, పాకిస్తాన్ పరిస్థితి తెలిసిందే. ఐఎంఎఫ్ గుమ్మం తొక్కితే అప్పు తీర్చే శక్తిని సమకూర్చుకొనే పేరుతో అది విధిస్తున్న షరతులతో జనం మీద మరిన్ని భారాలు మోపాల్సి ఉంటుంది. అమెరికాలోనూ జరిగేది అదే.

పేద దేశాలు ఎదుర్కొంటున్న పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఏకైక ధనిక దేశమైన అమెరికాకు సత్తా ఉండి కూడా ఎందుకు రుణాలు చేస్తున్నది అనే ప్రశ్న తలెత్తటం సహజం. కార్పొరేట్లకు దేశ సంపదలను కట్టబెట్టటంతో పాటు ప్రపంచం మీద ఎదురులేని పెత్తనం కోసం మిలిటరీ బడ్జెట్‌ను విపరీతంగా పెంచటం, మార్కెట్లు, వనరులను ఆక్రమించుకొనేందుకు చేస్తున్న దురాక్రమణలు, యుద్ధాలకు వెచ్చిస్తున్న ఖర్చు వంటి ప్రజా వ్యతిరేక పనులే ప్రధాన కారణం అని గమనించాలి. ప్రపంచ రుణ భారం 2023 తొలి మూడు నెలల్లో పెరిగిన 8.3 లక్షల కోట్ల డాలర్లతో మొత్తం 305 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. దీనిలో అమెరికా ప్రభుత్వ అప్పు 31.4 లక్షల కోట్ల డాలర్లు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్లలో గత రెండు దశాబ్దాల్లో అది నాలుగు నుంచి ఆరు లక్షల కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. కీలుబొమ్మ ఉక్రెయిన్‌కు 375 బిలియన్ డాలర్ల మేర సాయం అందించనున్నట్లు హిరోషిమా జి7 సమావేశాలలో జోబైడెన్ ప్రకటించాడు. ఇది గత సంవత్సరం ఇచ్చిన 113 బి.డాలర్లకు అదనం. కార్పొరేట్లకు జార్జి డబ్ల్యు బుష్ రెండు సార్లు తాత్కాలికంగా పన్నులు తగ్గించాడు. తరువాత అధికారానికి వచ్చిన ఒబామా వాటిని శాశ్వతం చేయటంతో పదేళ్లలో నాలుగు లక్షల కోట్ల డాలర్ల మేర ఖజానాకు గండిపడి ఆ మేరకు రుణం పెరిగింది. ఇదిగాక డోనాల్డ్ ట్రంప్ పన్ను రేటును అధికారికంగా తగ్గించి రెండు లక్షల కోట్ల డాలర్లను కట్టబెట్టాడు. ట్రంప్ బూట్లలో కాళ్లు దూర్చిన జో బైడెన్ అదే నడక సాగిస్తున్నాడు. దీంతో ఇంతింతై వటుడింతై అన్నట్లు అనకొండలా అప్పు పెరుగుతోంది. గత సంవత్సరం 55 కార్పొరేషన్లు అసలు పన్ను చెల్లించలేదని, అధికారికంగా 21 శాతం పన్ను చెల్లించాల్సి ఉన్నప్పటికీ సగటున చెల్లిస్తున్నది ఎనిమిది శాతానికి మించి లేదని హిరోషిమాలో బైడెన్ గర్వంగా చెప్పుకున్నాడు.

ఇలాంటి మినహాయింపులు ఇవ్వటానికి కార్పొరేట్లు దివాలా తీశాయా అంటే అదేమీ లేదు. 2014-2020 కాలంలో ఏటా 20 శాతం చొప్పున లాభాలు పెంచుకోగా వాటి నుంచి ఖజానాకు రావాల్సిన మొత్తాలు 60 శాతం తగ్గాయి. ఓఇసిడి దేశాల జిడిపిలో కార్పొరేట్ పన్ను భాగం సగటున మూడు శాతం కాగా అదే అమెరికాలో 1.1 శాతమే ఉంది. దాని తరువాత చివరన ఒక శాతంతో లాత్వియా ఉంది. ఇక పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రతి పదేళ్లకు ఒకసారి వస్తున్న సంక్షోభాలలో దివాలా తీస్తున్న కార్పొరేట్ కంపెనీలను అదుకొనేందుకూ అప్పులే మార్గం. అది వారికి వరం జనానికి శాపం. 2008లో ఒబామా రెండు లక్షల కోట్ల డాలర్లను కార్పొరేట్లకు సమర్పించుకున్నాడు. ప్రతి సంక్షోభమూ ప్రతి చోటా గతంలో కార్మికవర్గ సంపాదించుకున్న హక్కులు, సామాజిక రక్షణలనూ హరిస్తున్నది. తప్పనిసరై కరోనా కాలంలో ఇచ్చిన మెడికల్ బీమా రాయితీలను సమీక్షించాలని రాష్ట్రాలను బైడెన్ ఆదేశించాడు. వాటిని గనుక రద్దు చేస్తే 53 నుంచి 142 లక్షల మంది వరకు వీధిన పడతారు. అందువలన ఇది ఒక్క అమెరికా సమస్యే కాదు. పెద్దన్న అడుగు జాడల్లో నడిచే ప్రతి చోటా అప్పుల అనకొండలు కార్మికవర్గం మీద దాడులకు దిగుతాయి.

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

జనవాక్యం

'పొగ' ప్రమాదం ...

పొగాకు వాడకం ప్రపంచ మానవాళికి పెనుశాపంగా పరిణమించింది. దీని మూలాన ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మరణిస్తున్నారు. వీరిలో 12 లక్షల మంది పరోక్ష ధూమపానం వల్ల కూడా మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు తెలియజేస్తున్నాయి. హుక్కా, చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీ వాడకం మన ఆరోగ్యంపై పలు విధాలా దుష్పరిణామాలు చూపుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అంతే గాకుండా పొగాకు వాడకంలో భారతదేశం రెండవ స్థానంలో ఉండటం, పొగాకు నుంచి వెలువడే పొగలో 40,000 పైగా హానికరమైన రసాయనాలు ఉండటం, అందులో 70కి పైగా అత్యంత అపాయకరమైన క్యాన్సర్ కారకాలు ఉండటం మనల్ని ఎంతో గగుర్పాటుకు, ఒకింత భయాందోళనలకు గురిచేస్తుంది. అదేవిధంగా పొగాకు వాడకంలో ఓ భాగమైన ధూమపానం చేసే వారికే కాకుండా పక్కన ఉండి ఆ పొగ పీల్చేవారికి కూడా పెను ప్రమాదం పొంచి వుంది. పొరపాటున ఈ పొగాకు వాడకానికి అలవాటు పడ్డామంటే మన రోగ నిరోధక శక్తి తగ్గటంతో పాటు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధి, మూత్రపిండాలు చెడిపోవడం, టీబీ వ్యాధులు, మధుమేహం, కంటి, వినికిడి సమస్యలు, చిగుళ్లకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఒకవేళ ఈ పొగాకు వాడకం అలవాటు వుంటే దీనికి గుడ్‌బై చెప్పాల్సిందే. లేదంటే మన అమూల్యమైన ఆరోగ్యాన్ని మనమే పాడుచేసుకున్న వారమవుతాము.


– బి.ఎం.రెడ్డి, బేతంచెర్ల, నంద్యాల జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

తిరుమలలో మూడంచెల భద్రత

ప్రజాశక్తి - తిరుమల

మారుతున్న కాలానుగుణంగా సరికొత్త పరిజ్ఞానాన్ని ఉపయోగించు కుంటూ తిరుమల శ్రీవారి ఆలయ భద్రతను పటిష్టం చేసేలా టిటిడి ఏర్పాట్లు చేస్తోంది. భౌతిక,సైబర్ సెక్యూరిటీపై కేంద్ర రాష్ట్ర భద్రత అధికారులు ద్వారా టిటిడి అధ్యయనం చేయిస్తోంది. భద్రతాపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రపంచంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రతను తిరుమలలో ఉండేలా టిటిడి చర్యలు చేపట్టింది. వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమలకు నిత్యం 60 వేల నుంచి 75 వేల వరకు భక్తులు వస్తుంటారు. ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమల పుణ్య క్షేత్రంలో మూడంచెల భద్రత ఉన్న ఎక్కడో ఒకచోట లోపం జరుగుతూనే ఉంది. దర్శన టికెట్ల అమలు నుంచి భద్రత పరమైన అంశాల వరకు ఏదో రకంగా వార్తల్లో నిలుస్తోంది. మారుతున్న కాలానుగుణంగా టిటిడి అనుసరిస్తున్న వర్చువల్ విధానం అత్యంత పటిష్ఠమైన సైబర్ నేరగాళ్లు ఏదో రకంగా నకిలీ టికెట్లను రూపొందించి మరి భక్తులను మోసగించిన సంఘటనలు చాలా వరకు వెలుగులోకి వచ్చాయి. మూడంచెల భద్రత తిరుమలలో ఉందనీ చెప్పుకునే అధికారులు గంజాయి, మద్యం వంటివి తరలివస్తున్న నియంత్రించలేకపోతున్నారు. మొన్నటికి మొన్న శ్రీవారి ఆలయంలోకి ఓ యువకుడు మొబైల్ ఫోన్ తీసుకొని వెళ్ళి మరి ఆనంద నిలయాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం, ఉగ్రవాదులు తిరుమలలో సంచరిస్తున్నట్లు నకిలీ మెయిల్ రావడం, సిఎంవో స్టిక్కర్ గల వాహనం మాడ వీధుల్లో రావడం వంటివి భద్రత గూర్చి పలు అనుమానాలు కోట్లాది మంది భక్తులలో ఆందోళనలు కలిగిస్తున్నాయి. తిరుమలలో మూడంచెల భద్రతను పటిష్టం చేసేందుకు టిటిడి అడుగు ముందుకు వేసింది. తిరుమల భద్రతపై ముఖ్య అధికారిగా రాష్ట్ర హెూం ప్రిన్సిపాల్ సెక్రెటరీ హరీష్ కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. రెండు రోజులగా స్థానిక అన్నమయ్య భవనంలో టిటిడి భద్రత అధికారులు, ఇంటెలిజెన్స్, పోలీస్ ఉన్నత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.స్థానిక అన్నమయ్య భవనంలో తిరుమలలో భద్రత ఏర్పాట్లుపై సెక్యూరిటీ ఆడిట్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిటిడి భద్రత విభాగంతో పాటు రాష్ట్రం నుంచి పలువురు ఉన్నత అధికారులు పాల్గొన్నారు. ఆధునిక టెక్నాలజి సాయంతో తిరుమలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు. సీసీటీవీ కంట్రోల్ రూమ్ లో కత్రిమ మేధను ఎలా వినియోగించాలి, ఎలాంటి సాఫ్ట్ వేర్ ను వాడాలి అనే అంశాలపై అధ్యయనం చేస్తామన్నారు. అదేవిధంగా యాంటీ డ్రోన్ టెక్నాలజీ, బాడీ స్కానర్స్ వినియోగంపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని రాష్ట్ర హెూం ప్రిన్సిపాల్ సెక్రటరీ హరీష్ గుప్తా తెలిపారు. తిరుమలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరపడానికి ఎస్పి లేదా ఏఎస్పి స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఏడు కమిటీలు ఏర్పాటు చేశామని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు..ఈ కమిటీల్లోని అధికారులు 15 రోజుల పాటు పరిశీలన జరిపి నివేదిక సిద్ధం చేస్తారని, మరోసారి సమావేశమై సమీక్షిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత కమిటీలు చేసిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని డీఐజీ తెలిపారు.



28.24 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- జలుమూరు

శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని శ్రీముఖలింగంలో గంజాయిని విక్రయిస్తుండగా బుధవారం ఏడుగురిని అరెస్టు చేశారు. విక్రయదారుల నుంచి 28.24 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరికి ఒడిశా రాష్ట్రానికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయని పోలీసులు తెలిపారు.

ఆదర్శ పాఠశాలలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్రంలోని 162 మోడల్ స్కూళ్లలో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ కమీషనర్ ఎస్.సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలలలో బోధనా మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందని, విద్యను అభ్యసించేందుకు ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని స్పష్టం చేసారు. సంబంధిత జిల్లాల్లో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలలో 10వ తరగతి లో ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు వివరాల కోసం http:amps.apcfss.in http://cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 22 నుంచి జూన్ 6 లోపల నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డు లను ఉపయోగించి గేట్ వే ద్వారా అప్లికేషను రుసుము చెల్లించిన తర్వాత వారికి ఒక జనరల్ నెంబర్ కేటాయించబడుతుందని, ఆనెంబర్ ఆధారంగా పై తెలిపిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు రుసుము ఒసి, బిసి, ఇడబ్లుఎస్‌లకు రూ.200 , ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.150 చెల్లించాలని తెలిపారు. ప్రవేశాలు 10 వ తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం కేటాయిస్తామని తెలిపారు.

వైసిపికి ఎస్‌సివి గుడ్ బై..!

- తిరిగి టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం
- తాజాగా విజయవాడలో చంద్రబాబుతో భేటీ

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సివి నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడనున్నారు. ఆ మేరకు ఆయన తిరిగి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీన ఎస్‌సివి నాయుడు విజయవాడలో టిడిపి అధినేత నారా చంద్రబాబుతో భేటీ అయ్యారనీ, ఆయన పార్టీలో చేరేందుకు బాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఎస్‌సివి అనుచరులు బాహాటంగా చెప్పుకోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఈ నెలాఖరు లోగా ఎస్‌సివి తన అనుచరగణంతో టిడిపిలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలిసింది. శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో ఉన్న తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున బాబు సమక్షంలో టీడీపీ లో చేరుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే శ్రీకాళహస్తి రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకోనున్నాయి. అధికార పార్టీ వైసిపికి పెద్ద ఎదురు దెబ్బేనని చెప్పుకోవాలి.

ఆరుగురిని కాపాడిన పోలీసులు

- అనంతపురంలో రైలు కింద పడబోయిన తండ్రీ కొడుకులు
- గుత్తిలో చెరువులో దూకబోయిన తల్లీకూతుళ్లు

ప్రజాశక్తి-అనంతపురం, గుత్తి

నగరంలోని ఐదో రోడ్డుకి చెందిన గురజాల హరికష్ణ కుటుంబ సభ్యులతో గొడవపడి తన కుమారులైన ప్రవీణ్, ప్రేమ్‌కుమార్‌లను తీసుకొని శివారులోని నేషనల్ పార్క్ దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నాడు. ఇద్దరు పిల్లలతో పాటు రైలు కిందపడి చనిపోతున్నామంటూ సెల్ఫీ ఫొటోను బంధువులకి పంపాడు. దీంతో వారు అప్రమత్తమై డయల్ 100కు సమాచారం ఇవ్వగా త్రీ టౌన్ సిఐ కత్తి శ్రీనివాసులు హుటాహుటిన రెండు పోలీసు బందాలను ఆ ప్రాంతానికి పంపారు. హెడ్ కానిస్టేబుల్ శివయ్య, కానిస్టేబుళ్లు ఆనంద్, రంజిత్, నరేష్ అక్కడికి చేరుకుని వారిని కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కౌన్సెలింగ్ అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనలో వెంటనే స్పందించి ముగ్గురి ప్రాణాలను కాపాడిన త్రీ టౌన్ సి.ఐ కత్తి శ్రీనివాసులుతో పాటు పోలీసులను ఎస్పి కె.శ్రీనివాసరావు అభినందించారు.

చెరువులో పడబోగా..

గుత్తి : పట్టణంలోని బిసి కాలనీలో నివాసం ఉండే సూర్యనారాయణ మద్యానికి బానిసై కుటుంబ పోషణను విస్మరించాడు. దీనికి తోడు భార్యను చిత్రహింసలు పెడుతుండేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన భార్య కృష్ణవేణి ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీసి మొబైల్ ఫోన్ ఇంట్లోనే ఉంచి కుమార్తెలు మేఘన, శైలజలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంతలో ఇంటికి వచ్చిన సూర్యనారాయణ మొబైల్ ఫోన్‌లో సెల్ఫీ వీడియో చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో అప్రమత్తమైన సీఐ ఎం.వెంకటరామిరెడ్డి, ఎస్ఐ బి.రామకష్ణారెడ్డి సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని చెరువు కట్టపై కృష్ణవేణి ఇద్దరు కుమార్తెలతో ఉండడం గుర్తించి వారిని రక్షించారు. అలాగే సూర్యనారాయణకు పద్ధతి మార్చుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకోబోయిన తల్లీ కుమార్తెలను పోలీసులు రక్షించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య సేవల్లో గూడెం ఆసుపత్రికి ప్రథమ స్థానం

- మంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం (పశ్చిమగోదావరి జిల్లా)

			మొత్తాలు	Rs.13,19,517.40

షెడ్యూలు-బి

శ్రీమతి మారుపిల్ల విజయలక్ష్మి, భర్త మారుపిల్ల రవి కుమార్ పేరున ఉన్న కృష్ణా జిల్లా, సాయిపురం కాలనీ, సాయి బాబా టెంపులు దగ్గర, గొల్లపూడి, విజయవాడ-521225 వద్ద 6వ క్రాసు, డోరు నం. 23-33-2 (డోరు నం.23-70 దగ్గర), ప్లాటు నం.191, ఎలు.పి.నం.7/95, ఆరు.ఎసు.నం.198/2లో గల (ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండవ అంతస్తు మరియు మూడవ అంతస్తు)తో నిర్మించిన భవనము & 160చ.గ.ల విస్తీర్ణపు ఈక్విటేబులు తాకట్టు ల్యాండు. **సరిహద్దులు: ఉత్తరం:** ప్లాటు నం.190, **దక్షిణం:** ప్లాటు నం.192, **తూర్పు:** రోడ్డు, **పడమర:** ప్లాటు నం.170.

తేది: 10.05.2023
ప్రదేశం: విజయవాడ

సం/- అధీకృత అధికారి, తమిళనాడు మెర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్
హైదరాబాద్ రీజియన్ (విజయవాడ బ్రాంచి కొరకు)

నలుగురు గో గూండాలకు ఏడేళ్ల జైలు

గురుగ్రామ్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2018 రక్బర్ ఖాన్ హత్య కేసులో నలుగురు గోగూండాలకు అల్వార్‌లోని జిల్లా కోర్టు గురువారం ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ఒక నిందితుడిపై ఆరోపణలను నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమవ్వడంతో అతన్ని నిర్దోషిగా విడుదల చేశారు. 2018 జులై 20వ తేదీ రాత్రి రక్బర్ ఖాన్ తన స్నేహితుడు అస్లాం ఖాన్‌తో కలిసి కాలినడకన తమ ఇంటికి పశువులను తీసుకెళ్తుండగా గోగూండాలు ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడి నుంచి అస్లాంఖాన్ తప్పించుకోగా, రక్బర్ ఖాన్‌ను గోగూండాలు దారుణంగా కొట్టి చంపారు. ఈ ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో నరేష్, విజయ్, పరమజీత్, ధర్మేంద్రలకు ఒక్కొక్కరికీ ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్ గోయల్ తీర్పు చెప్పారు. మరో నిందితుడు నవాల్‌పై ఆరోపణలను రుజువు చేయకపోవడంతో విడిచిపెట్టారు.

జమ్ముకాశ్మీర్‌లో జి20 నిర్వహణ తప్పు

- నోమ్ చోమ్‌స్కీ

న్యూఢిల్లీ : కాశ్మీర్‌లో జీ20 సమావేశం నిర్వహణపై అమెరికన్ విద్యావేత్త నోమ్ చోమ్‌స్కీ స్పందించారు. 'ఆక్రమిత' కాశ్మీర్‌లో ఇలాంటి సమావేశాన్ని నిర్వహించడం తప్పు అని ఆయన అన్నారు. జి20 ప్రతినిధులు తమ మూడ్రోజుల శ్రీనగర్ పర్యటనను బుధవారం నగరంలోని కొన్ని సుందరమైన ప్రదేశాలను సందర్శించి ముగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ జి20 సమావేశాన్ని నిర్వహించటంపై ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశారు. జి20లో సభ్య దేశాలైన చైనా, సౌదీ అరేబియా, టర్కీ, అతిథి దేశం ఈజిప్ట్ ఈ కార్యక్రమాన్ని బహిష్కరించిన అనంతరం జి20 సమావేశం సోమవారం ప్రారంభమైంది. మోడీ సర్కారు 2019లో జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370 రద్దు అనంతరం కాశ్మీర్‌లో జరిగిన మొదటి అతిపెద్ద అంతర్జాతీయ కార్యక్రమం ఇదే కావటం గమనార్హం. కాశ్మీర్‌లో జి20 సమావేశాన్ని నిర్వహించడం అనాలోచితమని చోమ్‌స్కీ వివరించారు. "1947లో జమ్మూకాశ్మీర్.. భారత్‌లో చేరిన చట్టపరమైన ఒప్పందాన్ని భారతదేశం పూర్తిగా ఉల్లంఘించటంతో చాలా మంది బాధితులలో (విభజన వారసత్వం) కాశ్మీర్ ఒకటిగా ఉన్నది. దాని కష్టాలు తర్వాతి సంవత్సరాలలో, ప్రత్యేకించి 2019లో మరింత కఠినమైన రూపాలను తీసుకున్నాయి" అని ఆయన అన్నారు. బహుశా భూమిపై అత్యంత సైనికీకరించ బడిన ఈ ప్రాంతం, జనాభా ఖైదు, హింస, అదృశ్యం, అత్యంత ప్రాథమిక హక్కులను కూడా కోల్పోయిందని చోమ్‌స్కీ చెప్పారు. న్యూయార్క్‌కు చెందిన కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) కాశ్మీర్‌లో భారత్ సాధారణ స్థితిని ప్రదర్శించడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ పత్రికా స్వేచ్ఛపై దాడి జరుగుతున్నదని పేర్కొనటం గమనార్హం.

వేదాలలోనూ శాస్త్రీయ ఆవిష్కరణలు : ఇస్రో ఛైర్మన్

న్యూఢిల్లీ : శాస్త్రీయ ఆవిష్కరణలు వేదాలలోనూ ఉన్నాయని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని మహర్షి పాణిని సంస్కృతం-వేద విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ యూనివర్సిటీ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. 'భారతీయ ఆవిష్కరణలు అరబ్ దేశాల ద్వారా యూరప్‌కు చేరుకున్నాయి. ఆపై అవే తిరిగి పాశ్చాత్యభావాలుగా చెప్పబడ్డాయి' అని అన్నారు. కృత్రిమ మేధస్సుకి సంస్కృతం అనుకూలంగా ఉంటుందని చెప్పారు. 'ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు సంస్కృతాన్ని ఇష్టపడతారు. ఇది కంప్యూటర్ల భాషకు సరిపోతుంది.గణన కోసం సంస్కృతాన్ని ఎలా ఉపయోగించవచ్చనే దానిపై పరిశోధనలు జరుగుతున్నాయి' అని తెలిపారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాల్సిందే

- లేకపోతే 4 రాష్ట్రాల ఎన్నికల్లోనూ కర్ణాటక పరిస్థితే
- కిసాన్ మహా పంచాయత్‌లో సత్యపాల్ మాలిక్ హెచ్చరిక
- కొనసాగిన రెజ్లర్ల ఆందోళన



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని జమ్ము కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ డిమాండ్ చేశారు. ఆడబిడ్డలకు న్యాయం చేయకపోతే రానున్న నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి కర్ణాటక తరహా పరిస్థితే వస్తుందని హెచ్చరించారు. హర్యానాలోని జింద్-నర్వానా జాతీయ రహదారి ఖట్కర్ టోల్ ప్లాజా వద్ద గురువారం నిర్వహించిన కిసాన్ మహా పంచాయత్‌లో ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అహంకారంతో ఉందన్నారు. న్యాయం చేయాలంటూ దేశంలోని ఆడబిడ్డలు వీధుల్లో తిరుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమని అన్నారు.

రెజ్లర్ బజరంగ్ పునియా మాట్లాడుతూ ఈ పోరులో కచ్చితంగా విజయం సాధిస్తామని అన్నారు. ఈ నెల 28న పార్లమెంట్ ఎదుట జరిగే మహాపంచాయత్‌కి మహిళలు, యువత అత్యధికంగా చేరుకోవాలని కోరారు. పూర్తి శాంతి, క్రమశిక్షణతో పాల్గొనాలని సూచించారు. మహిళా రెజ్లర్ వినేష్ ఫోగట్ మాట్లాడుతూ తాను పతకం తెచ్చినప్పుడు ఇక్కడ కూతుళ్లకు ఎంతో గౌరవం ఉందని, కానీ ఇప్పుడు వీధిలో కూర్చునే పరిస్థితి వచ్చినా కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీకి చెందిన బలమైన ప్రజాప్రతినిధి కావడం వల్లే స్వేచ్ఛగా విడిచిపెట్టారని విమర్శించారు. ఇది త్రివర్ణ పతాక వైభవం కోసం జరుగుతున్న పోరాటమని అన్నారు. కుస్తీ మాత్రమే కాదు, అన్ని క్రీడల్లోనూ బ్రిజ్ భూషణ్ లాంటి వారు ఉన్నారని, వారందరినీ ఏరివేయాలని, ఇందుకోసం బాధితులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 9053903100 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వడంతో దేశంలోని ప్రతి మహిళ ఈ పోరాటంలో తమ గళాన్ని వినిపించాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి రెజ్లర్లు చేస్తున్న ఆందోళన గురువారం నాటికి 33 రోజులు పూర్తి చేసుకుంది. ఈనెల 28న కొత్త పార్లమెంట్ ఎదుట దేశ మహిళా క్రీడాకారులు తలపెట్టిన మహాపంచాయత్‌కు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో ఆటగాళ్లు ప్రజల మద్దతు కూడగడుతున్నారు.

శాంతికి విఘాతం కలిగిస్తే ఆర్‌ఎస్‌ఎస్‌నైనా నిషేధిస్తాం

- కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే



బెంగళూరు : కర్ణాటక శాంతియుత వాతావరణానికి విఘాతం కలిగించే ఏ సంస్థనైనా నిషేధిస్తామని ఆ రాష్ట్ర మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. పాపులర్ ఫ్రంట్, భజరంగ్ దళ్‌పై నిషేధం విధిస్తున్నట్లు మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా కర్ణాటకలో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధిస్తారా? అనే ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే, మత విద్వేషాలను వ్యాప్తి చేసే, కర్ణాటకకు చెడ్డపేరు తెచ్చేందుకు ప్రయత్నించే మతపరమైన లేదా రాజకీయ సంస్థలతో వ్యవహరించడానికి లేదా నిషేధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకాడదు. "ఆర్‌ఎస్‌ఎస్ లేదా మరేదైనా సంస్థ కావచ్చు, అవి శాంతిభద్రతలకు ముప్పు కలిగిస్తే, వాటిని నిషేధించడానికి మేము వెనుకాడం" అని మంత్రి ఒక జాతీయ వార్తా సంస్థతో అన్నారు. ఈ విషయాన్ని ఆయన ట్విట్టర్‌లో కూడా పంచుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్, పాపులర్ ఫ్రంట్‌లను నిషేధిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

శరద్‌పవార్‌తో కేజ్రీవాల్ భేటీ

- కేంద్రం 'ఢిల్లీ ఆర్డినెన్స్'పై చర్చ
- ఆర్డినెన్సును వ్యతిరేకిస్తూ మద్దతు తెలిపిన ఎన్‌సిపి

ముంబయి : ఢిల్లీలో సర్వీసులను (అధికారుల పోస్టింగులు, బదిలీలు) తన నియంత్రణలో ఉంచుకునే విధంగా మోడీ సర్కారు తీసుకొచ్చిన వివాదాస్పద ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా ఆప్ కన్వీనర్, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల మద్దతును కూడగట్టే ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు. ముంబయి పర్యటనలో రెండోరోజు ఎన్‌సిపి చీఫ్ శరద్‌పవార్‌ను కలిశారు. దక్షిణ ముంబయిలోని వై.బి చవాన్ సెంటర్‌లో వీరు సమావేశమయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద ఆర్డినెన్సుపై చర్చించారు.

ఈ సమావేశంలో కేజ్రీవాల్ వెంట పంజాబ్ సీఎం భగవంత్ మాన్, ఆప్ నాయకులు సంజయ్ సింగ్, ఆ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా, ఆప్ ఇతర నాయకులు ఉన్నారు. సమావేశం అనంతరం కేజ్రీవాల్, శరద్ పవార్ మీడియాతో మాట్లాడారు. బీజేపీయేతర పార్టీలు కలిసి వస్తే రాజ్యసభలో ఈ ఆర్డినెన్సును ఓడించొచ్చని కేజ్రీవాల్ అన్నారు. ఈ ఆర్డినెన్సు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ముప్పు అని శరద్‌పవార్ అన్నారు.

రెండ్రోజుల పర్యటనలో భాగంగా ముంబయికి వచ్చిన కేజ్రీవాల్ మొదటి రోజు(బుధవారం) మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రేను బాంద్రాలోని ఆయన ఇంటిలో కలిశారు. ఆప్ పోరాటానికి మద్దతిస్తామని ఉద్ధవ్ తెలిపారు. ఈనెల 23న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీని కలిసిన కేజ్రీవాల్ ఆమె మద్దతను కూడగట్టారు.

ఢిల్లీలో పోలీసు, శాంతి భద్రతలు, భూవ్యవహారాలు మినహాయించి మిగతా అన్ని అధికారాలను అక్కడ ఎన్నికైన ప్రభుత్వానికి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఈనెల 11న తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ.. ఢిల్లీలో గ్రూప్-ఏ అధికారులు, బదిలీలపై కేంద్రం అధికారం చలాయించే విధంగా ఈనెల 19న మోడీ సర్కారు ఆర్డినెన్సును తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

ఆకాశాన్నంటిన ఆహార ద్రవ్యోల్బణం

బ్రిటన్‌లో 20 శాతానికి చేరిక



లండన్ : బ్రిటన్‌లో ఆహార ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకుతోంది. ఆహార ద్రవ్యోల్బణం గతేడాది కన్నా 20 శాతం పెరిగినట్లు గురువారం జాతీయ గణాంకాల కార్యాలయం పేర్కొంది. ఆహార ద్రవ్యోల్బణం 19.3 శాతంగా ఉందని, మార్చి నాటి 19.6 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గి 45 ఏళ్ల గరిష్టస్థాయికి దగ్గరగా చేరినట్లు గణాంకాలు తెలిపాయి. వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ) ద్రవ్యోల్బణం గత నెలలో ఏడాదికన్నా ఎక్కువ కాలం కనిష్టస్థాయికి పడిపోయింది. 8.7 శాతం వద్ద ఇప్పటికీ సగటు వేతన పెరుగుదలను అధిగమించింది. గతేడాది నుండి ఆకాశాన్నంటుతున్న పెరుగుదల ఇంధన ధరల స్థిరీకరణతో మార్చిలో 10.1 శాతానికి క్షీణించింది. ఆర్థికవేత్తలు అంచనాను మించి ఏప్రిల్‌లో 8.2 శాతానికి పడిపోయింది. ఆలివ్ నూనె వంటి నిత్యావసరాలు బడ్జెట్ కన్నా అధిక పెరుగుదలను ఎదుర్కొంటున్నాయి. ఇది గతేడాది కన్నా 49 శాతం పెరిగింది. జున్ను 42 శాతం, పాలు, ఉడికించిన బీన్స్ రెండూ కూడా 39 శాతానికి పెరిగాయి.

ఇప్పటికే జీవన వ్యయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వినియోగదారులపై ఇంధన బిల్లుల కన్నా ఆహార ధరల పెరుగుదల అధిక ప్రభావాన్ని చూపుతుందని రిజల్యూషన్ ఫౌండేషన్ హెచ్చరించింది. తక్కువ ఆదాయం ఉన్న వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొంది. వేతనాల కన్నా ధరలు వేగంగా పెరుగుతూనే ఉన్నాయని ట్రేడ్స్ యూనియన్ కాంగ్రెస్ (టియుసి) జనరల్ సెక్రటరీ పాల్ నొవాక్ ఆందోళన వ్యక్తం చేశారు. వేతన పెరుగుదల లేకుంటే కుటుంబాల జీవన ప్రమాణాలను పునరుద్ధరించలేరని అన్నారు.

ప్రాణాలు తీస్తున్న పర్యావరణ మార్పులు

- ఆసియాపై తీవ్ర ప్రభావం
- రెండో అత్యధిక మరణాలు భారత్‌లోనే
- మొదటి స్థానంలో బంగ్లాదేశ్
- ప్రపంచ వాతావరణ సంస్థ నివేదిక



న్యూఢిల్లీ : ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు మరణశాసనాలను రాస్తున్నాయి. ఈ అనూహ్య మార్పులు విపత్తులు, మానవ మరణాలకు కారణమవుతున్నాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా 1970-2021 మధ్య ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మరణాలు చోటు చేసుకున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం ఆసియా ఖండం పైనే అధికంగా చూపింది. ఇక్కడ మొత్తం 9.38 లక్షలకు పైగా మరణాలు సంభవించాయి. ఇందులో 1.38 లక్షలకు పైగా మరణాలతో భారత్ రెండో స్థానంలో ఉన్నది. పొరుగు దేశం బంగ్లాదేశ్ 5.20 లక్షలకు పైగా మరణాలతో మొదటి స్థానంలో ఉన్నది. వాతావరణ మార్పుల ప్రభావం ఆర్థిక వ్యవస్థ పైనా పడి తీవ్ర నష్టాన్ని ఏర్పర్చింది.

'వాతావరణ, నీటి తీవ్రతల కారణంగా మరణాలు మరియు ఆర్థిక నష్టాల స్థితి' పేరుతో ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఆయా ఖండాలు, ప్రాంతాలలో చోటు చేసుకున్న విపత్తులు, మరణాల గురించి ఈ నివేదిక వెల్లడించింది.

ఆసియాలో అధికం

ఈ నివేదిక సమాచారం ప్రకారం.. 1970 నుంచి 2021 మధ్య పర్యావరణ మార్పులతో సంభవించిన మరణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆసియా ఖండం తీవ్రంగా ప్రభావితమైంది. 3,612 విపత్తులలో 9,84,263 మరణాలు ఇక్కడ చోటు చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన వాతావరణ మార్పుల మరణాలలో ఇది 47 శాతం. అలాగే, ఇక్కడ రూ. 1.15 కోట్ల కోట్లు (33 శాతం) ఆర్థిక నష్టం సంభవించింది.

భారత్‌లో 1.38 లక్షలకు పైగా మరణాలు

ఇలాంటి మరణాల్లో భారత్ 1,38,377 మరణాలతో రెండో స్థానంలో ఉన్నది. 5,20,758 మరణాలతో బంగ్లాదేశ్ మొదటి స్థానంలో ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో మయన్మార్(1,38,666 మరణాలు), చైనా (88,457)గా ఉన్నాయి. ఇక ఈ ఆసియా దేశాల్లో విపత్తుల సంఖ్య చైనాలో అత్యధికంగా 740గా ఉన్నది. ఆ తర్వాతి స్థానాల్లో భారత్(573), బంగ్లాదేశ్(281)లు ఉన్నాయి.

ఆసియా తర్వాత ఆఫ్రికా.. సోమాలియాలో అధికం

ఆసియా తర్వాత ఆఫ్రికా అధికంగా ప్రభావితమైంది. ఇక్కడ 1839 విపత్తులలో 7,33,585 మరణాలు చోటు చేసుకున్నాయి. ఆర్థిక నష్టం రూ. 3.55 లక్షల కోట్లకు పైగా నమోదైంది. 95 శాతం మరణాలు కరువుల కారణంగానే చోటు చేసుకున్నాయి. తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఆఫ్రికా దేశం సోమాలియాలో అత్యధికంగా 4 లక్షల మరణాలు చోటు చేసుకున్నాయి.

ఒక్క అమెరికాలోనే రూ.1.40 కోట్ల కోట్లు నష్టం

ఉత్తర అమెరికా, మధ్య అమెరికా, కరీబియన్ లలో 2107 విపత్తులు సంభవించగా.. 77,454 మరణాలు చోటు చేసుకున్నాయి. రెండు ట్రిలియన్ల ఆర్థిక నష్టం వాటిల్లింది. ప్రపంచవ్యాప్తం ఆర్థిక నష్టం 46 శాతంతో ఈ ప్రాంతాలలోనే చోటు చేసుకోవటం గమనార్హం. ఈ కాలంలో యుఎస్ఎ రూ.1.40 కోట్ల కోట్లు నష్టాన్ని చవి చూసింది. దక్షిణ అమెరికాలో 58,484 మరణాలు, రూ.9.53 లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. నైరుతి పసిఫిక్‌లో 66,951 మరణాలు, రూ.15.37 లక్షల కోట్లు నష్టం ఏర్పడింది. ఇక యూరప్‌లో మొత్తం 1784 విపత్తులలో 1,66,492 మరణాలు, రూ.46.50 లక్షల కోట్ల ఆర్థిక నష్టం ఏర్పడింది.

మరో ముఖ్య నేత రాజీనామా

- ఇమ్రాన్ పార్టీకి దెబ్బ మీద దెబ్బ



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. మే9న ఆయన అరెస్టు దగ్గర నుండి పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పిటిఐ) నుంచి కీలక నేతలు ఒక్కొక్కరు వివిధ కారణాలతో వైదొలగుతున్నారు. పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఫవాద్ చౌదరి వైదొలగిన మరుసటి రోజే మరో మాజీ మంత్రి అసద్ ఉమర్ పార్టీ నుంచి తాను తప్పుకుంటున్నానని ప్రకటించారు. వీరిద్దరితోబాటు మరో డజను మంది దాకా పార్టీ పదవుల నుంచి తప్పుకోవడమో లేక పార్టీ నుంచి వైదొలగడమో చేశారు. ఈ రాజీనామాలు స్వచ్ఛందంగా చేసినవా లేక బయట నుంచి ఒత్తిళ్లకు తలొగ్గి చేసినవా అనేది ప్రశ్న. ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పిటిఐ ప్రధాన కార్యదర్శి అసాద్ ఉమర్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇమ్రాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరిగా అసాద్ ఉమర్‌కు పేరు ఉంది. ఇమ్రాన్ ఖాన్ మంత్రి వర్గంలో సమాచార మంత్రిగానూ పని చేశారు. అడైలా జైలు నుంచి విడుదలైన అనంతరం అసాద్ ఉమర్ ఈ ప్రకటన చేశారు. ఇమ్రాన్‌ఖాన్ అరెస్టుకు నిరసనగా మిలిటరీ ప్రధానకార్యాలయం ఎదుట పిటిఐ కార్యకర్తలు, ఇమ్రాన్ ఖాన్ అభిమానులు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన కేసులో ఉమర్‌తో సహా ఫవాద్ చౌదరీ, షైరీన్ మజరీస్ వంటి అనేక మంది పిటిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి విడుదలై వచ్చినవారు పార్టీతో సంబంధాలను తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశమైంది. పిటిఐ చీఫ్ ఇమ్రాన్ మాత్రం ఇవి బలవంతపు విడాకులని వ్యాఖ్యానించారు.

పాక్‌లో 'అప్రకటిత మార్షల్ లా' సుప్రీంలో ఇమ్రాన్ ఖాన్ పిటిషన్

ప్రస్తుతం పాకిస్థాన్‌లో 'అప్రకటిత మార్షల్ లా' అమల్లో ఉందని ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. ఈ మేరకు పాకిస్థాన్ సుప్రీంకోర్టులో ఇమ్రాన్‌ఖాన్ పిటీషన్ వేశారు. అనేక రాష్ట్రాల్లో ప్రజా పరిపాలనకు సహాయం చేయడానికి సైన్యాన్ని మోహరించడాన్ని ఈ పిటీషన్‌లో సవాల్ చేశారు. పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బులూచిస్తాన్, ఇస్లామాబాద్‌తో సహా పలు రాష్ట్రాల్లో షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ఆర్టికల్ 245ను అమలు చేయడాన్ని ఇమ్రాన్‌ఖాన్ ప్రశ్నించారు. పాకిస్థాన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 245 ప్రకారం దేశాన్ని రక్షించడానికి ప్రజా పరిపాలనకు సహాయం చేయడానికి సైన్యాన్ని పిలవవచ్చు. అయితే ఆర్టికల్ 245 అమలు చేసే విధంగా దేశంలో పరిస్థితులు లేవని ఇమ్రాన్‌ఖాన్ తన పిటీషన్‌లో తెలిపారు. ఈ పిటీషన్‌లో ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, పిఎంఎల్-ఎన్ నాయకులు, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్, షరీఫ్ కుమార్తె నవాజ్, మాజీ అధ్యక్షులు ఆసిఫ్ అలీ జర్దారీ, విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ ఇతరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

మరోసారి ఆస్పత్రి పాలైన ఆప్ నేత సత్యేందర్ జైన్ ..

న్యూఢిల్లీ : ఢిల్లీ మాజీ ఆరోగ్య మంత్రి, ఆప్ నేత సత్యేందర్ జైన్ మరోసారి ఆస్పత్రి పాలయ్యారు. గురువారం ఉదయం తీహార్ జైలులోని బాత్రూమ్‌లో కాలు జారి పడిపోవడంతో ఆయనను వెంటనే దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రికి తరలించారు. సత్యేందర్ జైన్ అనారోగ్యంతో ఆస్పత్రి పాలు కావడం వారంలో ఇది రెండోసారి. గత సోమవారం ఆయనను ఆస్పత్రికి తరలించే సమయంలో విడుదలైన ఫొటోలపై ఆప్ నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ ఫోటోల్లో సత్యేందర్ జైన్ చాలా సన్నగా, నీరసంగా కనిపించారు. గత శనివారం కూడా స్పృహతప్పి పడిపోవడంతో.. జైలు అధికారులు దీన్ దయాళ్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. అరెస్ట్ అనంతరం సత్యేందర్ జైన్ 35 కేజీలు తగ్గిపోయారు. ఆయన బెయిల్ పిటిషన్ల తిరస్కరణకు గురవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

న్యాయస్థానాల తీర్పులు అమలుకావట్లేదు..

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన
- కేంద్రం, కోర్టులు చొరవ తీసుకోవాలి
- జార్ఖండ్ హైకోర్టు కొత్త భవనం ప్రారంభం

రాంచీ: న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులు కొన్ని సందర్భాల్లో అమలు కాకపోవడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవేదన వ్యక్తం చేశారు. 165 ఎకరాల్లో నిర్మించిన జార్ఖండ్ కొత్త హైకోర్టు భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.."అనుకూలంగా తీర్పు వచ్చినా కొన్ని సందర్భాల్లో ఆ సంతోషం ప్రజల్లో ఎక్కువ సేపు ఉండటం లేదు. ఇందుకు కారణం కోర్టు ఉత్తర్వులు అమలు కాకపోవడమే. ఇక్కడ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, కేంద్ర న్యాయశాఖ మంత్రి మేఘ్వాల్, సీనియర్ జడ్జీలు ఉన్నారు. వారందరికీ నా విన్నపం ఒకటే.. నిజమైన అర్థంలో న్యాయం ప్రజల దగ్గరకు వెళ్లేలా చూడండి" అని సూచించారు. సిజెఐ హిందీలో ప్రసంగించడాన్ని అభినందించిన రాష్ట్రపతి న్యాయస్థానాల భాష అందరినీ కలుపుకొని వెళ్లేలా ఉండాలని అన్నారు. "అందుబాటులో ఉండటం అనేదానికి చాలా కోణాలు ఉంటాయి. అందులో ఖర్చు ఒకటి. కోర్టు దావాల్లో ఇది చాలా ఎక్కువగా ఉంటోంది. దీంతో చాలా మంది పౌరులకు న్యాయం చేరడం లేదు. దీనిపై అందరూ ఆలోచించాలి. కొత్త మార్గాలు అన్వేషించాలి. న్యాయస్థానాల భాష కూడా అందరినీ కలుపుకొనే వెళ్లేలా ఉండాలి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

బుకర్‌ప్రైజ్ అవార్డును సొంతం చేసుకున్న 'టైమ్ షెల్టర్'

న్యూఢిల్లీ : ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సాహిత్య పురస్కారమైన బుకర్‌ప్రైజ్ 2023 అవార్డును 'టైమ్ షెల్టర్' పుస్తక రచయిత జార్జి గోస్పోడినోవ్‌కి దక్కింది. ఈ పుస్తకాన్ని ఏంజెలా రోడెల్ ఇంగ్లీషులోకి అనువదించారు. ఈ బహుమతిని సొంతం చేసుకున్న తొలి బల్గేరియన్ నవల 'టైమ్ షెల్టర్' కావడం విశేషం. ఈ పుస్తకాన్ని ఈ పురస్కారానికి ఎంపిక చేసిన న్యాయమూర్తుల్లో ఒకరైన లీలా స్లిమని మాట్లాడుతూ... "టైమ్ షెల్టర్' అద్భుతమైన నవల. వ్యంగ్యం, విచారంతో కూడిన ఈ నవల సమకాలీన ప్రశ్నల్ని లేవనెత్తే లోతైన రచన. మన జ్ఞాపకాలు అదృశ్యమైనప్పుడు మనకు ఏమి జరుగుతుంది? అనే దానిపై జార్జి ఈ నవలను రచించారు. గతం గురించి కేవలం వ్యక్తిగతంగానే కాదు.. సామూహిక విధితో వ్యవహరించి.. సార్వత్రికమైన సంక్లిష్ట సమతుల్యతను జార్జి హృద్యంగా మనసుకు హత్తుకునేలా రచించార'ని అన్నారు. టైమ్ షెల్టర్ నవల గతానికి సంబంధించింది. ఈ అల్జీమర్ చికిత్సలో కూడా దశాబ్దాల కిందటిది కూడా రోగులకు వర్తమానంలో పదేపదే చెప్పి గుర్తు చేయాల్సి ఉంటుంది. ఎన్నిసార్లు చెప్పినా.. గతం వర్తమానంపై దాడి చేస్తూనే ఉంటుంది' అని అంతర్జాతీయ బుకర్ ప్రైజ్ వెబ్‌సైట్ పేర్కొంది.

అందరూ హాజరయ్యారు

- ఆస్ట్రేలియా పర్యటనపై మోడీ

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాలో భారత సమాజం నిర్వహించిన వేడుకలో అక్కడి అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ పాల్గొన్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసించారు. ఆరు రోజుల పాటు జరిగిన మూడు దేశాల పర్యటన ముగించుకుని గురువారం న్యూఢిల్లీలోని పాలం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు బిజెపి కార్యకర్తలు, మద్దతుదారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ సిడ్నీలో భారత సమాజం నిర్వహించిన కార్యక్రమంలో ఆ దేశ ప్రధాని అంటోనీ అల్బానెస్‌తో పాటు అధికార పార్టీ సభ్యులు, మాజీ ప్రధాని, ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా పాల్గొన్నారని తెలిపారు. భారత ప్రతినిధిగా అందరూ తనని గౌరవించారని చెప్పారు. అది మోడీ గొప్పతనం కాదని, భారతదేశం యొక్క బలమని అన్నారు. ఈ నెల 28న రాష్ట్రపతిని ఆహ్వానించకుండా పార్లమెంట్ నూతన భవనాలను మోడీ ప్రారంభోత్సవం చేయనున్న నేపథ్యంలో, ఆ కార్యక్రమానికి హాజరుకాబోమని 19 ప్రతిపక్ష పార్టీలు ప్రకటించిన నేపథ్యంలో మోడీ ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం విశేషం. ఆరు రోజుల పర్యటనలో తొలుత జి-7 సదస్సు కోసం జపాన్ వెళ్లిన మోడీ తరువాత పపువా న్యూగినియా, ఆస్ట్రేలియాల్లోనూ పర్యటించారు.

ఇడిని ఉసిగొల్పుతున్నారు

- క్రూరమైన చట్టాలు ప్రయోగిస్తున్నారు
- బహిరంగ లేఖలో ప్రముఖుల మండిపాటు

న్యూఢిల్లీ : దేశంలో ప్రభుత్వ విమర్శకుల పైన, మహిళల పైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని ఉసిగొల్పుతున్న సంఘటనలు పెరిగిపోయాయని వివిధ రంగాలకు చెందిన ఐదు వందల మందికి పైగా ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా), మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) వంటి చట్టాలను కూడా రాజకీయ కక్షసాధింపు చర్యల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. అసమ్మతివాదులను అణచివేసేందుకు వారిని నిర్బంధించి శిక్షిస్తున్నారని, భయపెడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆర్‌టిఐ కార్యకర్త అంజలీ భరద్వాజ్ ద్వారా వారొక బహిరంగ లేఖను విడుదల చేశారు. వేధించాలనుకుంటున్న మహిళా మేధావులను, కార్యకర్తలను ఇడి కార్యాలయానికి పదేపదే పిలిపిస్తూ, గంటల తరబడి వేచి ఉండేలా చేసి, మహిళా అధికారి లేకుండానే విచారించి, పత్రాలు సమర్పించాల్సిందిగా పదేపదే కోరుతున్నారని ఆ లేఖలో వివరించారు. పేదలు, అట్టడుగు వర్గాల వారి కోసం ప్రభుత్వాన్ని, దాని విధానాలను విమర్శించే వారిపై ఉపా, పిఎంఎల్ఎ వంటి క్రూరమైన చట్టాలను వినియోగిస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలను వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. మహిళలను పిలిచి విచారించేందుకు సరైన పద్ధతులు పాటించాలని కోరారు. విచారణలకు అంతమే లేకుండా పోతోందని తెలిపారు. అవసరం లేని పత్రాలు, వ్యక్తిగత సమాచారం అడుగుతున్నారని, విచారణతో సంబంధం లేని ఇతర కుటుంబ సభ్యుల గురించి కూడా ఆరా తీస్తున్నారని వివరించారు.

ఆహార భద్రత, పారదర్శక పాలన, శాంతి-సామరస్యం, పౌరసత్వం, రైతుల హక్కులు వంటి ప్రాధాన్యత కలిగిన జాతీయ అంశాలను లేవనెత్తే మహిళలను లక్ష్యంగా చేసుకొని వేధింపులకు గురి చేస్తున్నారని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వమైనా, ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వమైనా, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వమైనా జరుగుతోంది మాత్రం ఒకటేనని విమర్శించారు. చట్టాల దుర్వినియోగాన్ని వారంతా ముక్తకంఠంతో ఖండించారు. బహిరంగ లేఖపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అదితీ మెహతా, సిపిఐ (ఎం) నేత బృందాకరత్, ఎంపీ జవహర్ సిర్కార్, ఆర్థికవేత్త జయతీ ఘోష్, రచయితలు జాన్ దయాల్, కె.లలిత, మాజీ రాయబారి కెపి ఫాబియన్, పరిశోధకుడు మీనన్ సేన్, జర్నలిస్ట్ ప్రమీలా ఫిలిపోస్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌తోపాటు పలు సంఘాల ప్రతినిధులు సంతకాలు చేశారు.



ముంబయిలో ముగిసిన జి-20 రెండో దశ డిఆర్ఆర్‌డబ్ల్యూజి సమావేశాలు

ముంబయి : మహారాష్ట్రలోని ముంబయి లో జరిగిన జి-20 రెండో దశ విపత్తు ప్రమాదం తగ్గింపు వర్కింగ్ గ్రూపు (డిఆర్ఆర్‌డబ్ల్యూజి) సమావే శాలు గురువారంతో ముగిసాయి. ఈ సమావేశాల్లో విపత్తు ప్రమాదాల తగ్గింపులో మౌలిక సదుపాయాల ప్రాముఖ్యత, ప్రమాదాల తగ్గింపు కోసం ఆర్థిక సహాయం అంశాలపై ప్రధానంగా చర్చించారు. విపత్తుల ప్రభావాన్ని తగ్గించడంలో సామాజిక రక్షణ వ్యవస్థల పాత్రను కూడా చర్చించారు. సమావేశంలో జి-20 దేశాలు విపత్తులను ఎదుర్కోవడంలో తమ కార్యక్రమాలను, కేస్ స్టడీస్‌ను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. ఈ సమావేశంలో జి-20 దేశాల ప్రభుత్వ ప్రతినిధులతోపాటు డిఆర్ఆర్ నిపుణులు, ఐక్యరాజ్య సమితి సంస్థలకు చెందిన అధికారులు, బ్యాంక్- ఆర్థిక రంగ నిపుణులు, పరిశోధనా సంస్థ నిపుణులు పాల్గొన్నారు. మొత్తంగా 122 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం ప్రధానంగా వచ్చే మూడేళ్ల పాటు విపత్తులను ఎదుర్కోవడానికి సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై చర్చించాయి. జి-20 మూడో దశ విపత్తు ప్రమాదం తగ్గింపు వర్కింగ్ గ్రూపు (డిఆర్ఆర్‌డబ్ల్యూజి) సమావేశాలు జులై 24 నుంచి 26 వరకూ చెన్నైలో జరగనున్నాయి. జి-20 మొదటి దశ డిఆర్ఆర్‌డబ్ల్యూజి సమావేశాలు ఈ ఏడాది మార్చి-ఏప్రిల్‌లో గాంధీనగర్‌లో జరిగాయి.

ఫ్యాషన్



పి.బాలాజీ,
5వ తరగతి,
శ్రీ శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూలు,కొండమూరు,
కర్నూలు జిల్లా.



కయ్యూరు శర్వాణి,
పుత్తూరు,
తిరుపతి జిల్లా.

ఎండలో ఆటలా!

ఓ వీధిలో పిల్లలంతా కలిసి ఆడుకుంటున్నారు. ఎండ మాత్రం విపరీతంగా ఉంది. ఆటల గోలలో పడి వేడిని పట్టించుకోలేదు. అందరూ కేకలు వేస్తూ దొంగ–పోలీసు ఆట ఆడుకుంటున్నారు. కిషోర్ ఒక్కసారిగా 'అమ్మా...! అని గట్టిగా అరిచి, పడిపోయాడు. అది చూసిన తన స్నేహితులు, మిగిలిన పిల్లలు భయంతో పరుగులు తీశారు. ఓ పిల్లవాడు దగ్గరలో ఉన్న దుకాణానికి వెళ్ళి పానీయాలు తీసుకొచ్చాడు. ఇంకొకడు తన ఇంట్లోకి వెళ్లి, కుండలో ఉన్న నీళు తీసుకొచ్చాడు. మిగిలిన పిల్లలు దగ్గర్లో ఉన్న ట్యూషన్ టీచర్ ఇంట్లోకి తీసుకెళ్లారు.

ఆమె అతన్ని ముఖంపై నీళ్లు చల్లింది. కిషోర్ కళ్లు తెరిచి చూశాడు. తనకు తలంతా మైకంగా ఉందని చెప్పాడు. వడదెబ్బ తగిలిందని టీచర్‌కు అర్థమైంది. తడిగా ఉన్న మెత్తటి క్లాత్ తీసుకుని ముఖం, కాళ్లు, చేతులు తుడిచింది. గ్లూకోజ్ కలిపిన గ్లాసుడు మంచినీళ్లు తాపింది. కొబ్బరినీళ్లు తెప్పించి, తాపించింది. గంట తర్వాత మజ్జిగలో నిమ్మకాయ పిండి, అందులో ఉప్పు, చెక్కర కలిపి ఇచ్చింది. తోటి పిల్లలు కిషోర్‌కు ఏం అయ్యిందో తెలియక టీచర్ చేస్తున్న సపర్యలు చూస్తూ ఉండిపోయారు. అప్పుడు టీచర్ వారి ముఖాలు చూసి వారి మనసులో ఉన్న అనుమానాలు తీర్చాలనుకుంది.

"పిల్లలూ! కిషోర్‌కి వడదెబ్బ తగిలింది. విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతుంది. కాకపోతే చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే చాలా ప్రమాదం జరిగి ఉండేది. ఇలాంటి సమయంలో కూల్‌డ్రింక్స్ తాగకూడదు. అసలు ఇంత వేడిలో ఆడుకోకూడదు. బయటకు వెళ్లేటప్పుడు తప్పకుండా తలకు టోపి పెట్టుకోవాలి. మంచినీళ్లు బాగా తాగుతుండాలి. లేకపోతే ఇలాగే కళ్లు తిరిగి పడిపోతారు. ఇక నుంచి మీరు నీడలోనే ఆడుకోండి. ఇంట్లోనే ఓ చోట కూర్చుని బోర్డు గేమ్స్ ఆడుకోండి" అని చెప్పింది. పిల్లలంతా సరే టీచర్ అంటూ ఇళ్లకు వెళ్లిపోయారు.




- గిద్దలూరు సాయి కిషోర్,
రాయదుర్గం.

బొమ్మరిల్లు





రాళ్లబండి సాహితి,
7వ తరగతి,ప్రభుత్వ పాఠశాల,
బరంపేట,
నరసరావు పేట, పల్నాడు జిల్లా.





డి. సంతోషి,
7వ తరగతి,
జెడ్.పి.హెచ్.ఎస్ స్కూలు,
నున్న,
విజయవాడ,
కృష్ణా జిల్లా.

నాన్న

నా ప్రాణం నువ్వే నాన్న
నా ధైర్యం నువ్వే నాన్న
ఎంతో కష్టపడి మమ్మల్ని చదివిస్తున్నావు
అడిగినవన్నీ మాకు కొనిస్తున్నావు
మంచీ మర్యాద నేర్పిస్తున్నావు
మా ప్రాణాలై నిలుస్తున్నావు
మా బాధ్యతలన్నీ తీసుకుంటున్నావు
మమ్మల్ని నీ గుండెలపై మోస్తున్నావు
ఐ లవ్యూ నాన్న ...







- ఎం. సాయికీర్తి, 6వ తరగతి
ఎం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల
మహానంది(మం), నంద్యాల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

---

మీ కోసం

ఇడ్లీ, దోశల పిండి బాగా పులిసిపోయినప్పుడు పిండి కొలతకు రెట్టింపు కొలతలో నీరు తీసుకుని పిండిలో కలిపి ఓ గంటసేపు పక్కన బెట్టాలి. ఆ తరువాత పిండి కదలకుండా నిదానంగా నీటిని పారబోస్తే పులుపుదనం తగ్గుతుంది.

జీవన సౌరభం

మెల్లగా నడిచినా కానీ, వెనకడుగు వేయకు.

JEEVANA జీవన the family

పిల్లలతో ఎలా ఉంటున్నారు..



చిన్న పిల్లలు చాలా విషయాలను, అలవాట్లను తల్లిదండ్రులను చూసే నేర్చుకుంటారు. ఎందులోనైనా అమ్మానాన్నలనే రోల్‌మోడల్‌గా తీసుకుంటారు. ముఖ్యంగా తల్లిదండ్రుల దగ్గర నుంచి సైకలాజిక్ థియరీస్, సోషల్ స్కిల్స్ నేర్చుకుంటారు. అందువల్ల వారికి రోల్ మోడల్‌గా ఉండటం తల్లిదండ్రులకు చాలా కీలకం. అయితే చాలామంది తల్లిదండ్రు లు తమకు తెలియ కుండానే పిల్లలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంటారు. ఇది వారిపై మానసిక ప్రభావాన్ని చూపి ప్రతికూల ధోరణి కలిగిస్తుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

స్వీయ విమర్శలు

చాలా సందర్భాల్లో దంపతులు తమ అందం, కెరీర్, ఆర్థిక విషయాల గురించి తమను తాము నిందించుకుంటారు. ఇలాంటివి పిల్లల ఎదుట చేస్తే సరైన లక్ష్యాలు రూపొందించుకోవడంలో వారు ఫెయిల్ అవుతారు. ఇది పిల్లల్లో ఒత్తిడికి కారణమౌతుంది.

గ్యాడ్జెట్స్

ఇటీవల కాలంలో గ్యాడ్జెట్స్ వినియోగం బాగా పెరిగిపోయింది. భార్యభర్తలు పక్కపక్కనే ఉన్నా ఎవరి ఫోన్లో వారు బిజీగా మారిపోతున్నారు. పిల్లలను కూడా పట్టించుకోకుండా వాళ్ల ముందే సోషల్‌మీడియా, మెసేజింగ్, కాల్స్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఈ ధోరణితో పిల్లలు కూడా వాటికి అడిక్ట్ అయ్యే ప్రమాదం ఉంది. తమకు కూడా మొబైల్ కావాలని పట్టుబడతారు. తిండి, చదువు విషయంలోనూ గ్యాడ్జెట్స్ ఇస్తేనే చేస్తాం అన్న పంతం పెరిగిపోయి మొండిగా తయారవుతారు. ఇలాంటి ప్రవర్తన వాళ్ల చదువుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

తల్లిదండ్రుల చెడు అలవాట్లు

తల్లిదండ్రుల్లో చాలామంది తమకున్న అలవాట్లను పిల్లల ఎదుట ప్రదర్శిస్తారు. తండ్రి పిల్లల ముందే మద్యపానం చేయడం, సిగరెట్ కాల్చడం వల్ల పిల్లలు కూడా వాటికి అలవాటు పడే ప్రమాదం ఉంది.

పోలికలు వద్దు

తల్లిదండ్రులు తమ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకుంటారు. ముఖ్యంగా చదువులో అందరికంటే పైచేయి సాధించాలని తాపత్రయ పడుతుంటారు. అంచనాలను అందుకోకపోతే వాళ్ల స్నేహితులు, పక్కింటి పిల్లలు, బంధువుల పిల్లలతో పోల్చుతుంటారు. ఈ పద్ధతి వాళ్లను నిరుత్సాహానికి గురిచేస్తుంది. వాళ్లను ఎంకరేజ్ చేయడానికే ఇలా చేస్తున్నామని తల్లిదండ్రులు చెప్పుకున్నా పిల్లలపై సైకలాజికల్‌గా తీవ్ర ప్రభావం పడుతుంది.

వాదనలు వద్దు

పిల్లలు పక్కన ఉన్నప్పుడు ఇంట్లోని పెద్దవాళ్లు అతిగా వాదించుకోకూడదు. అది చూసి వాళ్లు కూడా అలాంటి ప్రవర్తననే అలవరుచుకునే ప్రమాదం ఉంటుంది. స్కూల్, ఆటలు ఆడే సమయాల్లో తమ వాదనే నెగ్గాలన్న ధోరణి పెరిగిపోయి అందరికీ దూరమయ్యే ప్రమాదం ఉంది.

కొట్టడం, తిట్టడం

పిల్లలు తెలిసో, తెలియకో ఏదైనా తప్పుచేస్తే తల్లిదండ్రులు వెంటనే దండించేస్తారు. గట్టిగా అరవడం, తిట్టడం, కొట్టడం చేస్తుంటారు. ఇది ఎంతమాత్రం మంచి పద్ధతి కాదు. చిన్న వయసులోనే వారిని దండించడం వల్ల మీపై వారిలో వ్యతిరేక భావన కలగొచ్చు. ఈ ధోరణి వారి భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది.


అమ్మ కోసం నుయ్యి తవ్వేశాడు..

అమ్మకు ఏదైనా పని చేసుకోవడం కష్టంగా ఉందనుకోండి.. మీలో ఎంతమంది పిల్లలు అమ్మ పనులకు సాయం చేస్తారు. ఆ జాబితాలో చాలా తక్కువ మందే ఉంటారు. అయితే మీరంతా ఒక్కసారి 14 ఏళ్ల ప్రణవ్ గురించి తప్పక తెలుసుకోవాలి. ప్రతి రోజూ నీళ్ళ కోసం అమ్మ పడే కష్టం చూస్తున్న ప్రణవ్ అమ్మ బాధ తీర్చాలని ఏకంగా బావినే తవ్వేశాడు. ప్రణవ్ గురించి ఇంకా తెలుసుకోవాలనుందా.. అయితే చదవండి..

ప్రణవ్ అమ్మానాన్నతో కలిసి ముంబయికి 128 కిలోమీటర్ల దూరంలోని పాల్ఘర్ జిల్లా ధావనగపడ అనే గ్రామంలో నివసిస్తున్నాడు. నలుగురు తోబుట్టువుల్లో చిన్నవాడు. 9వ తరగతి చదువుతున్నాడు. నూతన ఆవిష్కరణలు చేయడమంటే ప్రణవ్‌కు భలే సరదా. మొన్నీమధ్యే సోలార్ ప్యానెల్స్‌ను మోటారుబైక్‌తో అనుసంధానించి ఇంటిలో విద్యుత్ బల్బులు వెలిగించాడు. ఇప్పుడేమో ఓ పార, గునపం, చిన్న నిచ్చెన తీసుకుని ఏకంగా ఇంటి ముందు నుయ్యి తవ్వేశాడు. 'రోజంతా భూమిని తవ్వుతూనే ఉండేవాడు. భోజన విరామానికి కేవలం 15 నిమిషాల సమయమే తీసుకునేవాడు. మండుటెండలో చెమటలు కారుతున్నా తవ్వడం ఆపేవాడు కాదు. నేను అప్పుడప్పుడు అదీ రాళ్లను తీసేందుకే సాయం చేసేవాడ్ని' అంటూ కొడుకు గురించి గొప్పగా చెబుతున్నాడు తండ్రి రమేష్. రమేష్ కూరగాయల మార్కెట్లో రోజుకూలీకి పనిచేస్తున్నాడు. 'నాలుగురోజులు శ్రమించిన తరువాత ఒకరోజు భూమి నుండి నీటి ఊట బయటికి వచ్చింది. అప్పుడు నా బిడ్డ కళ్లు ఎంతగా మెరిశాయో నాకు ఇప్పటికీ గుర్తుంది' అంటూ తనయుడు చేసిన సాహసకార్యం గురించి గొప్పగా చెబుతోంది తల్లి దర్శన. 'అమ్మ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చాలా దూరం ప్రయాణించి బకెట్లతో నీళ్లుతెచ్చేది. ఆ నీళ్లే ఇంటి అవసరాలకు, వంటకు వాడుకునేవాళ్లం. బకెట్లు మోసి మోసీ అమ్మ చేతులు బొబ్బలెక్కేవి. అయినా నీళ్ల తేవడం తప్పేది కాదు. అమ్మ కష్టం చూడలేకపోయాను. అమ్మకు సాయంగా ఏదైనా చేయాలనుకుని బావి తవ్వడం ప్రారంభించాను. 20 అడుగుల లోతులోనే నీరు పైకి వచ్చింది. చాలా సంతోషమేసింది' అంటూ ప్రణవ్ చెబుతున్నప్పుడు అమ్మ పట్ల అతని ప్రేమ కళ్లల్లో కనిపిస్తోంది.

అమ్మ కోసం ప్రణవ్ బావి తవ్విన వార్త ఊరంతా దావాణంలా వ్యాపించింది. బావిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రణవ్ స్నేహితులు, కుటుంబాలు కదిలివస్తున్నాయి. 'మా స్కూలు టీచర్లు కూడా వచ్చారు. బావిని చూసి నన్ను చాలా మెచ్చుకున్నారు' అని నవ్వుతూ చెబుతున్నాడు ప్రణవ్. ఈ ఘటనతో సంకల్పం గట్టిదైతే వయసు అడ్డంకి కాదని మరోసారి రుజువైంది.

దీపావళికి 'జపాన్'



యాక్టర్ కార్తీ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ప్రకటించిన అప్‌డేట్ ప్రకారం జపాన్ ఇంట్రడక్షన్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. తెలుగు వెర్షన్‌ను విజయ్ దేవరకొండ లాంచ్ చేశాడు. కార్తీ స్టైలిష్‌గా ఇదివరకెన్నడూ కనిపించని లుక్‌లో పక్కా ఎంటర్‌టైన్ మెంట్ అందించబోతున్నట్టు కనిపించింది. ఈ చిత్రాన్ని దీపావళి సందర్భంగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. సునీల్, జీవీ ప్రకాశ్ కుమార్ బీజీఎం సినిమాకు స్పెషల్ అట్రాక్షన్‌గా ఉండబోతున్నారు. ఈ చిత్రానికి అన్బరివ్ యాక్షన్ సన్నివేశాలను కంపోజ్ చేస్తున్నాడు. ఈ చిత్రంలో అనూ ఎమ్మాన్యుయేల్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. జపాన్‌లో సునీల్, విజయ్ మిల్టన్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్‌ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ ప్రభు నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.




నేను బాగానే ఉన్నా..

'నా మీద కొన్ని రోజులుగా వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలు. తప్పుడు సమాచారాన్ని నమ్మకండి. ఇలాంటి రూమర్స్‌ను ప్రచారం చేయకండి. నేను చాలా సంతోషంగా ఉన్నాను' అంటూ టాలీవుడ్ సీనియర్ కమెడియన్ సుధాకర్ ఓ వీడియో విడుదల చేశారు. కొన్ని రోజులుగా సుధాకర్ చనిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఆయన ఆరోగ్యం బాలేదని.. ఐసీయూలో ఉన్నారంటూ మరికొందరు రూమర్స్ వినిపిస్తున్నారు. వీటిపై స్పందిస్తూ సుధాకర్ ఈ వీడియో విడుదల చేశారు.

ఓటీటీలో 'ముంబైకర్'

నటుడు విజయ్ సేతుపతి నటించిన హిందీ డెబ్యూ మూవీ 'ముంబైకర్'. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ చిత్రం వాయిదా పడుతూ వస్తోంది. జూన్ 2న విడుదల అవుతుందని మేకర్స్ ప్రకటించారు. డైరెక్టుగా ఓటీటీ ప్లాట్‌ఫాం జియో స్టూడియోస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీజర్‌ను కూడా షేర్ చేసింది. ఇందులో విజయ్ సేతుపతి ఓ చిన్నారిని కిడ్నాప్ చేసే గ్యాంగ్ స్టర్‌గా కనిపించారు. తర్వాత ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నాడనేది మిగిలిన కథ. ముంబైకర్ తెలుగు, తమిళ భాషల్లో అందుబాటులో ఉంటుంది. సంతోష్ శివన్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో విక్రాంత్ మెస్సీ, తాన్య మణిక్తల, రాఘవ్ బినాని కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ కథనందించడం విశేషం.





'మెన్ టూ' కామెడీ చిత్రం

నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష చెముడు, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, కౌశిక్ ఘంటశాల, రియా సుమన్, ప్రియాంక శర్మ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీ మే 26న రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో నటీనటులు బ్రహ్మాజీ, నరేష్ అగస్త్య మాట్లాడారు. వినోదాత్మకమైన ఈ చిత్రాన్ని చూసి అందరూ నవ్వుకుంటారన్నారు. ఈ సినిమా డిస్ట్రిబ్యూట్ చేస్తున్న మైత్రీ మూవీస్‌కు, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



'వి మెగా పిక్చర్స్' కోసం ఇద్దరు స్నేహితులు

ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ భాగస్వాముల్లో ఒకరైన విక్కీ (విక్రమ్), రామ్ చరణ్ మంచి స్నేహితులు. ఈ స్నేహబంధంతోనే ఇద్దరూ కలిసి ఎగ్జిబిషన్ సెక్టార్‌లో కొన్ని వ్యాపారాలు చేస్తున్నారు. తాజాగా వీరిద్దరూ ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించారు. 'వి మెగా పిక్చర్స్' అనే పేరుతో ఈ బ్యానర్‌ను మొదలుపెట్టారు. ఈ కొత్త బ్యానర్ మీద తొలిగా అఖిల్ హీరోగా సినిమా రావచ్చని తెలుస్తోంది. అలాగే శ్రీవిష్ణుతో కూడా ఓ సినిమా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.

ఫైనల్లో అడుగు పెట్టేదెవరు?

- టైటాన్స్, ఇండియన్స్ క్వాలిఫయర్ 2 నేడు
- అమీతుమీకి సిద్ధమైన హార్దిక్, రోహిత్



అహ్మదాబాద్ : గుజరాత్ టైటాన్స్ తొలిసారి ఓటమి భయం పట్టగా, ముంబయి ఇండియన్స్ సహజశైలిలో ప్లే ఆఫ్స్‌లో అదరగొడుతుంది. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ గత సీజన్లో, తాజా సీజన్లో ఎప్పుడూ తప్పక నెగ్గాల్సిన పరిస్థితిని ఎదుర్కొలేదు. లీగ్ దశలో మెరిసినా.. క్వాలిఫయర్ 1లో చతికిల పడింది. సూపర్‌కింగ్స్ చేతిలో ఓటమి టైటాన్స్‌ను ఆత్మరక్షణలోకి నెట్టింది!. లీగ్ దశ చివర్లో పుంజుకున్న ముంబయి ఇండియన్స్ కలిసికట్టుగా చెలరేగుతుంది. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణిస్తున్నారు. ఆరుసార్లు ఐపీఎల్ ఫైనల్స్ ఆడిన ముంబయి ఇండియన్స్.. ప్రియ ప్రత్యర్థి చెన్నై సూపర్‌కింగ్స్‌ను ఎదుర్కొనేందుకు ఎదురు చూస్తుంది. గుజరాత్ టైటాన్స్ సైతం సొంత మైదానంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో టైటిల్ పోరుకు సిద్ధం కావాలని తపిస్తోంది. అటు టైటాన్స్, ఇటు ఇండియన్స్ తొలుత ముఖాముఖి పోరులో తేల్చుకోవాల్సి ఉంది. ముంబయి ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ నేడు క్వాలిఫయర్ 2లో చావోరేవో తేల్చుకోనున్నాయి.

జోరుమీదున్న ముంబయి : ఐదుసార్లు చాంపియన్ ముంబయి ఇండియన్స్ ఈ సీజన్లో కీలక ఆటగాళ్ల సేవలు కోల్పోయింది. బుమ్రా గాయంతో దూరం కావటం, ఆర్చర్ సేవలు పూర్తిగా అందుబాటులో లేకపోవటంతో డెత్ ఓవర్లలో ప్రధాన సమస్య ఎదుర్కొంది. నయా సంచలనం ఆకాశ్ మధ్వాల్ ముంబయి డెత్ బౌలింగ్ కష్టాలకు చెక్ పెట్టాడు. ఎలిమినేటర్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టాడు. అటు బౌలర్లు, ఇటు బ్యాటర్లు ఫామ్‌లోకి రావటంతో ముంబయి ఇండియన్స్ నేడు ఫేవరేట్‌గా కనిపిస్తుంది. కామెరూన్ గ్రీన్, సూర్యకుమార్ యాదవ్‌లు ధనాధన్ ఊపు మీద ఉన్నారు. ఈ ఇద్దరిని అడ్డుకోవటం టైటాన్స్‌కు అంత సులువు కాదు. యువ బ్యాటర్లు తిలక్ వర్మ, నేహల్ వదేరా, టిమ్ డెవిడ్‌లు జోరందుకున్నారు. ఇక బౌలింగ్ విభాగంలో జేసన్ బెహన్‌డార్ఫ్, ఆకాశ్ మధ్వాల్, పియూశ్ చావ్లాలు వికెట్ల వేటలో కదం తొక్కుతున్నారు. లీగ్ దశ తొలి పది మ్యాచుల్లో పవర్‌ప్లేలో 9.2 ఎకానమీ, 54.9 సగటు నమోదు చేసిన ముంబయి బౌలర్లు.. చివరి ఐదు మ్యాచుల్లో 8.2 ఎకానమీ, 27.3 సగటుతో రాణించారు. ఇషాన్ కిషన్, రోహిత్ శర్మ సైతం పరుగుల వరద పారిస్తే ముంబయి ఇండియన్స్‌కు ఎదురుండదు.

ఆసియా కప్ దారెటు?

- ఆదివారం తేలనున్న భవితవ్యం
- బంగ్లా, శ్రీలంక, అఫ్గాన్ బోర్డులతో షా భేటీ

న్యూఢిల్లీ : 2023 ఆసియా కప్‌పై సందిగ్ధత కొనసాగుతుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) ఆసియా కప్ నిర్వహణపై పట్టుదలగా కనిపిస్తుండగా.. మరోవైపు ఆసియా కప్‌లో పోటీపడే ఇతర జట్లు భిన్న స్వరం వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆసియా కప్ భవితవ్యం ఆదివారం తేలనుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫైనల్ మే 28న జరుగనుంది. ఐపీఎల్ టైటిల్ పోరుకు బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, శ్రీలంక క్రికెట్ బోర్డు అధ్యక్షులను బీసీసీఐ ఆహ్వానించింది. అదే రోజు అహ్మదాబాద్‌లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) చైర్మెన్, బీసీసీఐ కార్యదర్శి జై షాతో మూడు దేశాల బోర్డుల ప్రతినిధులు సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ఆసియా కప్‌పై ముందుకెళ్లే విధానంపై ఓ నిర్ణయానికి రానున్నట్టు సమాచారం. 'బంగ్లాదేశ్, అఫ్గనిస్థాన్, శ్రీలంక క్రికెట్ బోర్డుల ప్రతినిధులు ఐపీఎల్ 2023 ఫైనల్‌కు రానున్నారు. ఈ సందర్భంగా ఆసియా కప్ 2023పై చర్చించనున్నారు' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించటంతో పాక్‌లో పర్యటించేందుకు భారత్ నిరాకరిస్తున్న సంగతి తెలిసిందే.



క్వార్టర్స్‌లో సింధు

- శ్రీకాంత్, ప్రణయ్ సైతం
- లక్ష్యసేన్ పరాజయం
- మలేషియా మాస్టర్స్

కౌలాలంపూర్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మలేషియా మాస్టర్స్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్‌లో సింధు మెరువగా.. పురుషుల సింగిల్స్‌లో హెచ్.ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ సైతం క్వార్టర్స్‌లో కాలుమోపారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్స్ పోరులో జపాన్ షట్లర్ అయా ఒహోరిపై వరుస గేముల్లో సింధు గెలుపొందింది. 21–16, 21–11తో ఎదురులేని విజయం నమోదు చేసింది. హెచ్.ఎస్ ప్రణయ్ మూడు గేముల మ్యాచ్‌లో పైచేయి సాధించింది. చైనా షట్లర్ లి షి ఫెంగ్‌పై 13–21, 21–16, 21–11తో మెరుపు విజయం నమోదు చేశాడు. తొలి గేమ్ కోల్పోయిన ప్రణయ్.. చివరి రెండు గేముల్లో రెచ్చిపోయాడు. థాయ్‌లాండ్ షట్లర్ కున్లావిట్‌పై కిదాంబి శ్రీకాంత్ మెరిశాడు. ఎనిమిదో సీడ్ ఆటగాడిపై 21–19, 21–19తో వరుస గేముల్లోనే విజయం సాధించాడు. ఇక యువ షట్లర్ లక్ష్యసేన్ నిరాశపరిచాడు. హాంగ్‌కాంగ్ షట్లర్ కా లాంగ్ ఆంగాస్ చేతిలో 15–21, 19–21తో వరుస గేముల్లో ఓటమి పాలయ్యాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68